భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

# వర్తమాన రాజకీయ పరిస్థితి

**2016, సెప్టెంబరు 17-19, న్యూఢిల్లీ**

**కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించిన తీర్మానం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# వర్తమాన రాజకీయ పరిస్థితి

## 2016, సెప్టెంబరు 17-19, న్యూఢిల్లీ
## కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించింది

## అంతర్జాతీయ పరిస్థితి

**పా**ర్టీ ఇరవై ఒకటవ మహాసభ నాటినుండి ముందుగా నిర్ణయమైన కార్యక్రమాల వలన, అంటే మొదటిగా పార్టీ మహాసభ నిర్ణయం మేరకు నిర్మాణ ప్లీనం నిర్వహణ జరపడం వలన రెండవది మనకు బలమైన స్థావరాలైన కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికలు జరగడం వలన యీ కాలంలో చోటుచేసుకున్న ముఖ్యమైన అంతర్జాతీయ పరిణామాల గురించి చర్చించి ఒక అంచనాకు రాలేక పోయాము. ఇదే కాలంలో జరిగిన మన కేంద్రకమిటీ సమావేశాలలో ఈ లోపాన్ని గమనంలోకి తీసుకోవటం జరిగింది. ముందుగా నిర్ణయమైన యీ కార్యక్రమాల కారణంగానే చివరకు జాతీయ పరిణామాలపై మనం విడుదల చేసిన పత్రాలపై సైతం గత కేంద్రకమిటీ సమావేశాలలో చర్చించలేక పోయాము. అయితే సాధ్యమైనంత త్వరగా ఈ లోపాన్ని అధిగమించాలని గత కేంద్రకమిటీ సమావేశంలో నిర్ణయించాము. కనుకనే పార్టీ 21వ మహాసభ అనంతరం సంభవించిన కొన్ని ముఖ్యమైన అంతర్జాతీయ పరిణామాలను యిక్కడ చర్చించడం జరుగుతుంది.

### ప్రపంచ ఆర్థిక సంక్షోభం

2008లో తలెత్తిన ఆర్థిక మాంద్యంతో మొదలైన ప్రస్తుత ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం కొనసాగటమేకాక, ఎన్నో కోణాలలో మరింత తీవ్రతను సంతరించుకున్నట్లు పార్టీ 20వ మహాసభ ఆమోదించిన కొన్ని సిద్ధాంత సమస్యలపై తీర్మానంలోనూ, పార్టీ 21వ మహాసభ రాజకీయ తీర్మానంలోనూ మనం నిర్ధారణకు వచ్చాము. ఈ సంక్షోభాన్ని అధిగమించేటందుకై ప్రపంచ పెట్టుబడిదారీ విధానం చేసే ప్రతి ప్రయత్నమూ సరికొత్త

లోతైన సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. ప్రస్తుత సంక్షోభాన్నుంచి బయటపడేందుకు ప్రపంచ పెట్టుబడిదారీ విధానం నిర్ధాక్షిణ్యంగా కార్మిక వర్గాన్ని పీల్చిపిప్పి చేసే విధానాన్ని, పొదుపు చర్యల పేరుతో ఎంచుకున్నది. కాని, యీ చర్యలు సైతం సంక్షోభం నుంచి బయట పడేందుకుగాను ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి ఏమాత్రం వుపకరించలేదు. మనం ఇది వరకే గమనించినట్టు ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఈ సంక్షోభం నుండి బయటపడేందుకు ఆదిమ సంచయనానికి దారి తీసిన అడ్డు అదుపు లేని దోపిడీ విధానం ద్వారానే ప్రజలను మరింతగా కొల్లగొట్టేందుకు చూస్తున్నది.

దీని నికర ఫలితం, నయాఉదార వాద విధానాలలోని ప్రపంచీకరణలో సహజంగానే ఇమిడిఉన్న అసమానతలు పెరిగే ధోరణి మరింతగా బలపడుతుంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశీయ డిమాండ్ నిరంతరంగా తగ్గుతుండడానికి దారితీస్తుంది. ప్రతీ పెట్టుబడిదారి దేశంలోనూ ఆర్థికాభివృద్ధి, పెరుగుదల అంతకంతకు తగ్గుతూ ఉంటుంది. ఆందోళన కల్గించేంత స్థాయిలో సంపదలలోనూ, ఆదాయాలలోనూ ఉన్న వ్యత్యాసాలు నానాటికీ అశేష ప్రజారాసుల కొనుగోలు శక్తి క్షీణించడాన్ని ప్రతిబింబిస్తుంది. గడచిన ఎనిమిదేళ్ళ సంక్షోభ కాలంలో అమెరికన్ జనాభాలోని 81 శాతం ప్రజల ఆదాయాలు స్తంభించటమో క్షీణించటమో జరిగినట్లు మెకన్సీ ప్రపంచ సంస్థ వెల్లడించింది. ఇదే విధంగా ఇటలీలో 97 శాతం, బ్రిటన్‌లో 70 శాతం, ఫ్రాన్స్‌లో 63 శాతం ప్రజలు యిలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. ఒకవైపు లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుంటే మరోవైపు ప్రజల కొనుగోలుశక్తి తరుగుతున్నది. పర్యవసానంగా ఉత్పత్తి కాబడ్డ సరుకుల అమ్మకాలు పెరగడం లేదు. సాంప్రదాయక పెట్టుబడిదారి పద్ధతుల ద్వారా అభివృద్ధి సాధ్యపడడం లేదు.

2016 సంవత్సరపు ప్రపంచ ఆర్థిక తీరుతెన్నులు విశ్లేషించిన ఐఎమ్ఎఫ్ ఆర్థిక దృక్పథం, దీని గమనం 'అత్యంత మందంగాను చాలా రోజులు కొనసాగేదిగాను' ఉంటుందని వివరించింది. 2017లో ప్రపంచ వృద్ధిరేటు 3.4 శాతానికి కుదించుకు పోగలదని జోస్యం చెప్పింది. ఇది చాలా ఎక్కువగా వేసినట్లుగా కనిపిస్తుంది. ప్రపంచ బ్యాంకు తన తాజా ప్రపంచ ఆర్థిక నివేదికలో గతంలో వేసిన అంచనాలను మరింత తగ్గించింది. 2016 జనవరిలో ప్రపంచ వృద్ధిరేటు 2.9 శాతంగా వుండగలదని అంచనా వేసిన ప్రపంచ బ్యాంకు తరువాత దీనిని 2.4 శాతానికి తగ్గించింది.

ఈ తగ్గుదలకు పెట్టుబడుల కొరత, ఎగుమతి రంగంలో పెరుగుదల నెమ్మదిగా వుండటం అన్న రెండు కారణాలను ప్రపంచ బ్యాంకు స్వయంగా గుర్తించింది.

ఈ రెండు అంశాలూ, అసంఖ్యాక ప్రజల కొనుగోలు శక్తిని ప్రాతిపదికగా చేసుకున్న దేశీయ డిమాండు స్థాయితో ముడిపడి వుంటాయన్నది సుస్పష్టం.

ఈ అంచనాల ప్రకారం యుఎస్ వృధిరేటు 2016 జనవరిలో వేసిన అంచనాల కన్నా 0.81 సాతం తక్కువగా ఉంటుందని ఊహిస్తున్నారు. దాని మొత్తం వృద్ధిరేటు 2 శాతంకన్నా తక్కువగా వుంటుందని అంచనా. 2017లో 2.2 శాతం వృద్ధిరేటు వుండగలదని ఐఎంఎఫ్ అంచనా వేసింది. దుర్మార్గమైన పొదుపు చర్యలను విధించినప్పటికీ యూరోజోన్ వృద్ధిరేటు 1.6 వద్దనే నిలచి ఉంటుందని అంచనా. ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి మూడవ స్తంభంగా కితాబులందుకుంటున్న జపాన్ విషయానికి వస్తే అబెనోమిక్స్ గురించి వూదరగొట్టినప్పటికీ అక్కడి వృద్ధిరేటు సుమారుగా 0.5 శాతంగా అంచనా వేయబడింది. 2017లో యిది కేవలం 0.2 శాతం మాత్రమే వుండగలదని ఐఎంఎఫ్ అంచనా వేసింది.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి కేంద్రాలుగా వున్న పై మూడింటిలోనూ వస్తుతయారీ రంగంలో ఎలాంటి పెరుగుదల లేదన్న వాస్తవం దేశీయ గిరాకీ కుదించుకు పోతున్నదన్న విషయాన్ని ప్రతిబింబిస్తున్నది.

## పెరుగుతున్న నిరుద్యోగం

వృద్ధిరేటు తక్కువగా వుండటం, సంక్షోభం కొనసాగుతుండటం సహజంగానే నిరుద్యోగం పెరుగుదలకు దారితీసింది. ప్రత్యేకించి యువజనులలో దీనిస్థాయి మరింత ఎక్కువగా వున్నది. ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతున్న అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ మౌలికమైన నిరుద్యోగ సమస్యను కేంద్రంగా చేసుకుని సాగుతున్నది. ఐరోపా యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగటానికి ఒక కారణం యువతలో పెరిగిన నిరుద్యోగ తీవ్రత అని చెప్పవచ్చు.

లాభాలను గరిష్టస్థాయికి పెంచుకోవడం, అదేసమయంలో దేశీయ డిమాండును కుదించి వేయటం అన్న క్రమంలోని అంతర్గత వైరుధ్యం పెరుగుదలను మందగింప చేస్తున్నది. దీనినే ప్రపంచబ్యాంకు 'ఎదురుగాలి'గా చిత్రించింది. అందువల్లనే వృద్ధి అంచనాలు, ప్రపంచ మాంధ్యం నుండి బయటపడుతుందన్న ఆశల అంచనాలు తారుమారవుతున్నవని పేర్కొన్నది.

## సంపన్నులు మరింత సంపన్నులవుతున్నారు, పేదలు మరింత పేదరికంలో మగ్గుతున్నారు

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి తన లాభాలను గరిష్టంగా పెంచుకునే ప్రాధమిక

లక్ష్యంతోనే నయాఉదారవాద విధానాలను ప్రవేశపెడుతూ తద్వారా ప్రపంచీకరణ చెందుతున్నది. 20వ మహాసభ సైద్ధాంతిక తీర్మానంలోనూ మనం దీనిని గుర్తించాము. ఈ సంక్షుభిత కాలంలో ద్రవ్యసంస్థల రుణాలలో అత్యధిక భాగం కార్పొరేట్ రంగానికే తరలిందేగాని అంతకు ముందులాగ ప్రజలకు కాదన్న వాస్తవంలోనే పై విషయం ప్రతిబింబిస్తున్నది. 2010 నుంచి ఆవిర్భవిస్తున్న మార్కెట్లు –వృద్ధి చెందుతున్న ఆర్థిక రంగాలలో ప్రయివేటు రంగానికన్నా కార్పొరేట్లకే మూడు వంతులు ఎక్కువగా రుణ పరపతి పెరిగింది. కార్పొరేట్ల పద్దుల చిట్టాలు బ్యాంకింగ్ వ్యవస్థను కుంగతీస్తున్నాయి (ఈనాడు మనం భారత దేశంలో చూస్తున్నది ప్రపంచ పెట్టుబడిదారి ధోరణలు, అందుకు తోడుగా మోదీ అనుసరిస్తున్న క్రోనీ పెట్టుబడీ విధానాలు).

తమ లాభాలను పెంచుకునేందుకు డోయ్‌చేయ్ బ్యాంకు కార్పొరేట్లకు పెద్ద ఎత్తున రుణాలను మంజూరుచేయడమే కాక కార్యనిర్వాహణాధికారులకు భారీ మొత్తాలలో జీతాలు చెల్లిస్తున్నది. ఇందువలన దాని బేస్ పెట్టుబడి స్థాయి మూడుశాతం కంటే తగ్గింది ఇది ప్రపంచ ద్రవ్య స్థిరత్వానికి ముప్పుతెచ్చిపెట్టే అంశమని ఐఎమ్ఎఫ్ అంటున్నది. దాదాపు 70,000 కోట్ల అమెరికన్ డాలర్లకు పైగావున్న, (అంటే సుమారుగా ప్రపంచ స్థూల జాతీయోత్పత్తితో సమానం) దాని ఆస్తులు ప్రమాదంలో పడ్డాయి. ఇటాలియన్ బ్యాంకుల పారుబకాయిల మొత్తం 5,36,000 యూరోలుగా వున్నది. గ్రీస్‌లో మొత్తం రుణాలలో 35 శాతాన్ని నిరర్థక ఆస్తులుగా ప్రకటించారు, అంటే, బహుశ తిరిగి రాకపోవచ్చునని అర్థం. తత్ఫలితంగా ఐరోపా యూనియన్‌లోని అనేక దేశాలు అత్యంత దారుణమైన సార్వభౌమిక రుణభారాన్ని మోస్తున్నాయి. కార్పొరేట్ సంస్థల దివాళాను దేశాల దివాళాగా మార్పిడి చేయటం ద్వారా ప్రస్తుత సంక్షోభం నుంచి బయట పడాలని ప్రపంచ పెట్టుబడిదారీ విధానం చూస్తున్నట్లు 20,21 మహాసభలు చేసిన విశ్లేషణ సరైనదేనని నేటి పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఈనాడు స్పెయిన్ జాతీయ రుణం ఆ దేశ వుత్పత్తితో పోలిస్తే 100 శాతంకన్నా ఎక్కువగా వున్నది. 20వ శతాబ్ది ప్రారంభం నుంచి చూసినట్లయితే యిదే అత్యధికం. గ్రీసు విషయానికి వస్తే దాని స్థూలదేశీయోత్పత్తితో పోలిస్తే దాని రుణం 170 శాతంగా వున్నది. ఐరోపా యూనియన్, ఐఎంఎఫ్, యూరోపియన్ బ్యాంకులు 44,000 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని యిచ్చినప్పటికీ యిదీ పరిస్థితి. ఈ మొత్తంలో 95 శాతాన్ని యీ బ్యాంకులకు, ఐరోపా యూనియన్‌కు, ప్రైవేటు పెట్టుబడిదారులకు, సట్టా వ్యాపారులకు గ్రీసు దేశం తిరిగి చెల్లించింది. వాస్తవానికి 1000 కోట్ల యూరోలను మాత్రమే గ్రీసు ఖర్చు చేసింది. పొదుపు చర్యల అనంతరం ఆర్థిక వ్యవస్థ గాడితప్పింది. 2016లో అక్కడి నిరుద్యోగం రేటు 24 శాతంగా వున్నది. యువతలో నిరోద్యోగం 50 శాతానికి చేరగా, కనీస వేతనాలు 22 శాతం తగ్గిపోయాయి.

ఇదేవిధంగా పేదలకు యిచ్చే పించనులు కూడా తగ్గిపోయాయి.

మొత్తంమీద చూసినట్లయితే పెట్టుబడిదారీ విధానపు వ్యవస్థీకృత సంక్షోభం నుంచి ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ బయటపడలేక పోతున్నది. 20, 21వ మహాసభల రెండింటా మనం గమనించినట్లుగా సంక్షోభం తీవ్రరూపాన్ని దాల్చినప్పటికీ పెట్టుబడిదారీ వ్యవస్థ దానంతటదే కుప్పకూలదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు రాజకీయ ప్రత్యామ్నాయం లేనట్లయితే ప్రజలను మరింతగా దోపిడీ చేయడం ద్వారా యీ సంక్షోభాన్నుంచి బయట పడటానికి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయత్నిస్తుంది. ఈ సంక్షోభం కొనసాగటాన్ని దృష్టిలో వుంచుకున్నపుడు మరోవిడత ప్రపంచ ద్రవ్య పతనం తప్పదనిపిస్తున్నది. ఈ ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రపంచ ద్రవ్య సంస్థలు, పెట్టుబడిదారీ దేశాలలోని బ్యాంకింగ్ వ్యవస్థ దెబ్బతింటాయని అనిపిస్తున్నది.

## ప్రపంచ పెత్తనాన్ని దృఢతరం చేసుకునేందుకై అమెరికా సామ్రాజ్యవాద ప్రయత్నాలు

ఈ సంక్షోభాన్ని అదనుగా తీసుకొని అమెరికా సామ్రాజ్య వాదం తన ఆర్థిక వ్యవస్థ పుంజుకుని పునరుజ్జీవనం పొందేందుకు, తన ప్రపంచ ఆధిపత్యాన్ని స్థిర పరచుకునేందుకు సైనిక జోక్యాల ద్వారాను దాడుల ద్వారాను ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల ద్వారాను బహుళ పక్ష వాణిజ్య ఒప్పందాల ద్వారాను ప్రయత్నిస్తున్నది.

**వాణిజ్య ఒప్పందాలు:** పసిఫిక్ దేశాల భాగస్వామ్య ఒప్పందాన్ని (టిపిపి) అమెరికా ముందుకు తీసుకువచ్చింది. ఈ తరంలోనే యిదొక బ్రహ్మాండమైన వాణిజ్య ఒప్పందంగా దీనిని కీర్తిస్తున్నారు. అమెరికా నేతృత్వాన కుదిరిన యీ ఒప్పందంలో పసిఫిక్ చుట్టూవున్న 12 దేశాలు భాగస్వాములుగా వున్నాయి. 40 శాతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇందులోఇమిడి ఉంది. ఐదేళ్ళ రహస్య చర్చల అనంతరం ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాలు అమెరికా కార్పొరేట్లకు అనుకూలంగా చేయబడ్డాయి. వీటి ప్రకారం అమెరికన్ కార్పొరేట్లు టి.పి.పి. పరిధిలోని సార్వభౌమ దేశాలు తమ లాభాలకు దెబ్బతగిలే దేశీయ విధానాలను అలంభించినట్లయితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవచ్చు. ఇది స్పష్టంగా ఆ పదకొండు దేశాల సార్వభౌమత్వంపై ఆక్రమణే. అమెరికన్ కార్పొరేట్ల లాభాలు తగ్గించే విధంగా జాతీయ ప్రభుత్వ విధానాలు ఉంటే ఆ చర్యలు, న్యాయనిర్ణయాలు, విధానాలు చెల్లవు.

అమెరికా ఇ.యు తోకూడా ఈ రకమైన ఒప్పందాన్ని కుదుర్చుకుందామని ప్రయత్నిస్తే అది సాధ్యపడలేదు. జర్మనీ, ఫ్రాన్స్ అమెరికా ఒత్తిడిని ఎదురించాయి. ఈ ఒప్పందం ద్వారా మొత్తం పన్నులను, ఇతర అడ్డంకులను తొలగించుకునే ప్రయత్నం

చేస్తున్నది. ఒక ట్రాన్స్- అట్లాంటిక్ స్వేఛ్ఛా వాణిజ్య ప్రాంతాన్ని ఏర్పరచుకోవాలని అనుకుంటున్నది. ఇదే కనుక జరిగితే అమెరికా బహుళ జాతి కంపెనీలు విపరీతంగా లాభపడతాయి. ఈ చర్చలను 2016 చివరివరకు కొనసాగించాలని అమెరికా కోరుకుంటున్నది. ఈ విషయంలో అమెరికాకు యురోపియన్ యూనియన్‌కు ఉన్న విభేధాలు బట్టబయలు అవుతున్నాయి.

## అంతర్గత సామ్రాజ్యవాద వైరుధ్యాలు

ఈ సంక్షోభం కొనసాగుతున్న ఫలితంగా, యిప్పటివరకు నయా ఉదారవాద ప్రపంచీకరణ ముసుగులో గుంభనగా వున్న అంతర్గత సామ్రాజ్యవాద వైరుధ్యాలు యిప్పుడిప్పుడే బహిర్గతమవుతున్నాయి. 20వ మహాసభ సిద్ధాంత సమస్యలపై ఆమోదించిన తీర్మానంలో మనం యీ విధంగా పేర్కొన్నాము.

> "ఐఎఫ్‌సి ప్రాబల్యం బలంగా వున్నంత మాత్రాన సామ్రాజ్యవాదుల అంతర్గత వైరుధ్యాలు అంతరించినట్లు కాదు. ఇవి కేవలం కొనసాగటమేకాక, అసమాన అభివృద్ధి అనే పెట్టుబడిదారీ విధానపు మౌలిక లక్షణం కారణంగా భవిష్యత్తులో మరింత తీవ్రతరం కానున్నాయి. ఈనాడు, ప్రపంచ వనరులపై పెత్తనం కోసం, లేదా, ప్రపంచాన్ని పునర్వ్యస్థీకరించేటందుకు, అంటే, నిర్దిష్ట పలుకుబడి ప్రాంతాలను సృష్టించేటందుకు సాగే ప్రయోజనాల ఘర్షణలో తరచుగా యివి ప్రతిబింబిస్తున్నాయి. భవిష్యత్తులో సాపేక్షక బలాబలాలను అనుసరించి పెట్టుబడిదారీ కేంద్రాల మధ్య ప్రయోజనాల ఘర్షణకు యివి దారితీస్తాయి. విభిన్న సామ్రాజ్యవాద శక్తులమధ్య భవిష్యత్‌లో జరగనున్న కరెన్సీ యుద్ధాలలో కూడా యివి కన్పించగలవు."

మనం దీనిని యిలా ముగించాము. "అంతర్గత సామాామ్రాజ్యవాద వైరుధ్యాలు ప్రస్తుతం గరిష్ట లాభాల కోసం ప్రపంచ దోపిడీని తీవ్రతరం చేసే ప్రక్రియలో గుంభనంగా వున్నప్పటికీ, విభిన్న రంగాలలో విభిన్న రూపాలలో అవి స్వయంవ్యక్తం అవుతున్నాయి."

21వ మహాసభ సమయంలో సామ్రాజ్యవాద శిబిరంలో కన్పించిన ఐక్యత ఛిద్రం కానున్న చిహ్నాలు కనిపిస్తున్నాయి.

**బ్రెగ్జిట్ :** ఈ వైరుధ్యాలు ఐరోపా యూనియన్ తీవ్రమైన ఒత్తిళ్ళు, యిబ్బందుల్లో చిక్కుకున్న విధానంలో ప్రతిబింబిస్తున్నాయి. బ్రెగ్జిట్ ప్రచారమూ, బ్రిటన్‌లో చోటుచేసుకున్న తుదిఫలితమూ యీ దిశలో సూచికగా నిలచింది. దాదాపు 52 శాతం బ్రిటిషర్లు ఐరోపా యూనియన్‌కు వ్యతిరేకంగా ఓటుచేశారు. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి సంస్థలు, బహుళజాతి

ఆర్థిక సంస్థలు తీసుకు వచ్చిన విపరీతమైన ఒతిళ్ళను తట్టుకుని కూడా బ్రిటన్ ప్రజలు యీ తీర్పును యిచ్చారు. చివరకు అమెరికా అధ్యక్షుడు ఒబామా సైతం, ఐరోపా యూనియన్ నుంచి బ్రిటన్ నిష్క్రమణకు వ్యతిరేకంగా నేరుగా ప్రచారం చేశాడు. ఐరోపా యూనియన్‌ను రాజ్యానికి అతీతంగాను, బ్రిటిష్ జాతీయ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేదిగా వున్నదని పలువురు బ్రిటిషర్లు, ప్రత్యేకించి పేదలు భావించారు. ఈ ఓటు పొదుపు చర్యలకు అసమానతల పెరుగుదలకు అతి కొద్ది మందికి అధికారాన్ని సంపదను ఆధిక్యతను ఇచ్చే వ్యవస్థ వ్యతిరేకతకు ప్రతిబింబం. సంప్రదాయక వుద్యోగావకాశాలు తగ్గడం పట్ల ఇంగ్లీషు కార్మిక వర్గం తన నిరసనను వ్యక్తం చేసింది. ఐరోపా యూనియన్‌లో కొనసాగడం వలన కార్మికుల జీవితాలలో జరిగే ముప్పును ఎత్తి చూపి ఇ.యు నుంచి బయటకు రావలసిందిగా కమ్యూనిస్టులు, వామపక్షవాదులు ప్రచారం చేశారు. అదేవిధంగా, కార్మికవర్గంపై ఐరోపా యూనియన్ చూపుతున్న వినాశకర ప్రభావాన్నీ, అలానే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను ఒక పద్ధతి ప్రకారం హరిస్తుండటాన్నీ కూడా ప్రచారం చేశారు. మితవాదులు కూడా ఐరోపా యూనియన్ నుంచి బయటకు రావటానికి మద్దతు యిచ్చారు. అయితే వారు యిలా మద్దతు యివ్వడంలో జాతి ద్వేషాలు, వలసల కారణంగా వుద్యోగాలు తగ్గటం, వలసలు పెరగటంతో 'బ్రిటిష్ సంస్కృతిపై జరుగుతున్న దాడి', ప్రధానాంశాలుగా వున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, ఐరోపా యూనియన్‌లు ప్రచారం చేస్తున్నట్లుగా ఐరోపా యూనియన్ నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్న అనంతరం నిరుద్యోగం పెద్దగా పెరిగిన సూచనలు లేవు. తగ్గుదల కూడా ఏమీలేదు, పూర్వం వలెనే 4.9 శాతంవద్ద నిలచి వున్నది.

ఐరోపా యూనియన్ స్థూల దేశీయోత్పత్తిలో యించుమించు 15 శాతంపైగా, ద్రవ్య సేవల కార్యకలాపాలలో 25 శాతం, ఐరోపా యూనియన్ మార్కెట్ మూల పెట్టుబడులలో 30 శాతం వాటాను బ్రిటన్ కలిగి వున్నది. ఇప్పుడిక ఇ.యు వ్యవస్థ స్థానంలో యురోపియన్ యూనియన్‌తో ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. బ్రిటిష్ పౌండ్ విలువ తారుమారైంది, కాగా, యిప్పుడు కాస్త అటూయిటూగా నిలకడను సాధించుకున్నది. కాని, బ్రిటిష్ ఆర్థిక స్థిరత్వం ఇంకా గగన కుసుమంగానే వున్నది. ఐరోపా యూనియన్ నుంచి బ్రిటన్ తప్పుకోవటం గురించి చర్చల క్రమంలో పలు సమస్యలు, అస్థిరత్వానికి సంబంధించిన నూతన అంశాలు తలెత్తుతాయి. కొన్ని మాసాలపాటు యివి కొనసాగుతాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనూ,

ఐరోపా యూనియన్ ఆర్థిక వ్యవస్థలోనూ తమకు చెందవలసిన వాటాల కోసం ఐరోపియన్ దేశాలకూ, బ్రిటన్‌కూ మధ్య ఘర్షణలు ముందుముందు కూడా కొనసాగుతాయి.

సహజంగానే బ్రెగ్జిట్ ఓటు బ్రిటన్‌లో రాజకీయ సంక్షోభాన్ని సృష్టించింది. ప్రధాన మంత్రి డేవిడ్ కామెరూన్ రాజీనామా చేశారు. నూతన ప్రధాన మంత్రిగా సనాతనవాదియైన థెరెస మే ప్రమాణ స్వీకారం చేశారు. లేబర్ పార్టీ సైతం సంక్షోభంలోపడింది. దాని నాయకుడైన జెరెమి కోర్బిన్‌పై టోనీ బ్లెయిర్ 'నూతన లేబర్' అనుచరులు తీవ్రమైన దాడినే చేశారు.

## మితవాదం వైపుకు రాజకీయాల మొగ్గు

కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం ప్రభావం రాజకీయాలపై కూడా పడింది. 'ఎన్నో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో మితవాదం పుంజుకుంది.

నవంబరు నెలలో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ అభ్యర్థిగా ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థిగా హిల్లరీ క్లింటన్ పోటీలో నిలిచే సూచనలు వున్నాయి. పార్టీకి వెలుపల వుండికూడా పార్టీ నామినేషన్‌ను గెలుచుకున్న మొట్టమొదటి వ్యక్తి ఇటీవలి అమెరికా చరిత్రలో డోనాల్డ్ ట్రంప్ అనే చెప్పవచ్చు. ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా ప్రజలలో జ్వలించిన ఆగ్రహాన్ని వుపయోగించుకుని మైనారిటీ వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రస్థాయిలో సాగిస్తున్నాడు. బడా వాణిజ్యవేత్తల ప్రయోజనాలను ముందుకుతెస్తూ, జనాలను జాతి, మత, ఉపజాతి భేదాల ప్రాతిపదికను చీలుస్తున్నాడు. డెమొక్రటిక్ పార్టీ ఒక బలమైన ప్రత్యర్థిని ఎదుర్కొన బోతున్నది. తనను తాను డెమొక్రటిక్ సోషలిస్టుగా ప్రకటించుకున్న బెర్నీ శాండర్స్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, పశ్చిమాసియాలో యుద్ధంవంటి విషయాలపై తీవ్ర ధోరణితోనే మాట్లాడుతున్నారు. మరోవైపున హిల్లరీ క్లింటన్ దుందుడుకు విదేశాంగ విధానానికి, బడా వాణిజ్యవేత్తలతో సాన్నిహిత్యానికి పెట్టింది పేరు. అయితే శాండర్స్ వెనుక జనం గుమిగూడుతుండటంతో ఆమె తన విధానాలలో మార్పులు చేసుకోక తప్పలేదు.

అమెరికన్లలో పేరుకుపోయిన తీవ్ర అశాంతికి ప్రతిరూపమే డోనాల్డ్ ట్రంప్ ఎదుగుదల. 1960ల నాటి పౌర హక్కుల వుద్యమం తర్వాత జరిగిన అత్యంత దుర్మార్గమైన జాత్యహంకార దాడుల పూర్వరంగంలో అమెరికన్ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ చోటుచేసుకున్నది. నల్లజాతివారిపై జరుగుతున్న యీ దాడులకు దోషులైన అధికారులు, పోలీసులు శిక్షలను తప్పించుకుంటున్నారు. ఆఫ్రో-అమెరికన్లలో యిది తీవ్ర అసంతృప్తికి దారితీసింది. 'బ్లాక్ లైవ్స్ మేటర్' (నల్ల వారివి దేహాలే) అన్న వుద్యమం అంతకంతకూ మద్దతును పుంజుకున్నది.

2014 ఎన్నికలలో ఐరోపా పార్లమెంటులో నాలుగింట ఒకవంతు స్థానాలకు మితవాదులే ఎన్నిక కావటం యూరప్ రాజకీయాలు మితవాదం వైపుకు మొగ్గు తున్నాయనడానికి రుజువు. పలు ఐరోపా దేశాలలో మితవాదులకూ, అతివాదులకూ మధ్య ఎన్నికల పోటీ తీవ్రంగా వుంటున్నది; ఎన్నికలలో మితవాదులు విజయం సాధించనప్పటికీ వారు గట్టి పోటీ యిస్తున్నారు. 2015లో స్పెయిన్‌లో జరిగిన ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. ఆ తరువాత 2016లో జరిగిన ఎన్నికల్లో కూడా స్పష్టమైన ఫలితాలు రాలేదు. కాగా, మితవాద కన్సర్వేటివ్ పార్టీ మరో 14 స్థానాలను అదనంగా గెలుచుకుని అతిపెద్ద పార్టీగా నిలచింది. పొదుపు చర్యలకు వ్యతిరేకంగా వుద్యమించిన కార్మికవర్గ నూతన సంకీర్ణ కూటమి 'పోడీమస్' తన స్థానాలను నిలబెట్టుకున్నప్పటికీ 3శాతం ఓట్లు తగ్గాయి. నెదర్లాండ్స్‌లో కన్సర్వేటివ్‌లు మరోసారి అతిపెద్ద పార్టీగా నిలచారు. ఫ్రాన్స్‌లో జాతుల అసంతృప్తి, వుద్రిక్తతలు పెరగటంతో మితవాద శక్తులు పుంజుకుంటున్నాయి. ఇటీవలి 'బుర్కిని' నిషేధం వివాదం మరోసారి తీవ్ర తరమై జాతి, మత విభజనలకు దారితీసింది. పోలండు వంటి దేశాలలో మితవాదులు ఎన్నికల్లో విజయాన్ని సాధించారు.

జర్మనీలో కూడా రాజకీయ మితవాదం పుంజుకున్నది. జర్మనీలోని ఒక రాష్ట్రంలో జర్మనీ మితవాద ప్రజా ప్రత్యామ్నాయం సోషల్ డెమక్రట్ల తర్వాత (ఏఎఫ్‌డి) రెండవ స్థానంలో నిలచింది. ఇది, ఏంజలా మెర్కెల్స్ క్రిష్టియన్ డెమొక్రటిక్ యూనియన్‌ను మూడవ స్థానానికి నెట్టివేసింది. ఈ గెలుపు మరో మూడు రాష్ట్రాలలో ఏఎఫ్‌డి విజయానికి దారితీసింది. జర్మనీలోని 16 రాష్ట్ర పార్లమెంట్లలో తొమ్మిదింటిలో ఏఎఫ్‌డి తన వునికిని చాటుకున్నది. వచ్చే ఏడాది జరిగే ఫెడరల్ ఎన్నికలలో మరిన్ని మంచి ఫలితాలను సాధించేందుకు సిద్ధంగా ఉంది.

**ప్రతిఘటనా ధోరణులు:** సంప్రదాయకమైన సోషల్–డెమొక్రటిక్, కన్సర్వేటివ్ పార్టీలు రెండూ నయా వుదారవాద విధానాలను అనుసరిస్తుండటంతో, యీ తరహా పార్టీలకు సరైన ప్రత్యామ్నాయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. అతివాద, మితవాదులకు చెందిన నూతన శక్తులు,పార్టీలు ఐరోపా ఖండంలో వునికిలోకి వచ్చాయి. ఉదాహరణకు, నెదర్లాండ్స్‌లో యిటీవలి ఎన్నికలలో సంప్రదాయక సోషల్–డెమొక్రట్లు ఆరవ స్థానానికి నెట్టివేయబడగా కొత్తగా వచ్చిన సోషలిస్టులు, సోషల్ లిబరల్స్ పైచేయి సాధించారు. ఇటలీలో ఫైవ్‌స్టార్ వుద్యమం బలపడి రోమ్ మేయర్ ఎన్నికలను గెలుచుకున్నది. వాస్తవానికి ఐరోపా రాజకీయాలలో ఒకరకమైన మధనం జరుగుతున్నది. ఫ్రాన్స్‌లో దీని జాడలను చూడవచ్చు. పచ్చి మితవాదియైన మేరీ లీ పెన్ పలు ప్రాంతాలలో

పైచేయిగా కన్పించినప్పటికీ ప్రజలు మాత్రం ఆమె పార్టీ ఓటమి పాలయ్యేలా ఎంతో చైతన్యంతో ఓటు చేశారు. నయా వుదారవాద దాడులకు వ్యతిరేకంగా నిలచి, తమ జీవనోపాధిని రక్షించే పార్టీల కోసం, శక్తుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే నూతన వామపక్ష బృందాలు, పక్షాలు ఆవిర్భవిస్తున్నాయి.

## టర్కీలో విఫలమైన సైనిక తిరుగుబాటు

2016 జూలై 15వ తేదీన టర్కీలో అధ్యక్షుడు ఎర్డోగన్‌కూ, ఆయన ప్రభుత్వానికీ వ్యతిరేకంగా వచ్చిన సైనిక తిరుగుబాటు విఫలం కావడంతో దేశంలో ఎర్డోగన్ పట్టు మరింత బలపడింది. తిరుగుబాటులో పాల్గొన్న వారిపై ప్రభుత్వం చేసిన దాడిలో దాదాపు 200 మంది ప్రజలు చనిపోయారు. న్యాయవ్యవస్థకూ, రక్షణ దళాలకూ, ప్రసారమాధ్యమానికీ యింకా యితర రంగాలకు చెందిన వేలమందిని ప్రభుత్వం అరెస్టు చేసింది.

ఎర్డోగన్ ఒకవైపున దేశంలో తన పలుకుబడిని పెంచుకుంటూనే, మరోవైపున టర్కీ ప్రయోజనాల కోసం అమెరికా, రష్యాలతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. నాటో కూటమి నుంచి టర్కీ బయటకు రావాలని రష్యా కోరుతుండగా, సిరియాలో సైనికంగా జోక్యం చేసుకునేందుకుగాను టర్కీకి అమెరికా అనుమతి యిచ్చింది. ఈ పరిస్థితి ఎటు దారితీసేదీ కాలమే నిర్ణయించవలసి వుంది.

## అమెరికా సైనిక వ్యూహాలు

అమెరికా తన ప్రపంచ పెత్తనాన్ని బలోపేతం చేసుకునేందుకై పశ్చిమాసియాలో సైనికంగా జోక్యం చేసుకోవటంతో పాటు, రష్యాతో ఘర్షణ పడేందుకూ, అలానే చైనాను కట్టడి చేయాలన్న తన వ్యూహాన్ని పటిష్ట పరుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

## తూర్పుకు మరలిన నాటో దృష్టి

బాల్టిక్ దేశాలలోనూ, తూర్పు పోలెండులోనూ నాటో బలగాలను మోహరించాలని2016 జూలైలో నాటో నిర్వహించిన వార్సా శిఖరాగ్ర సభ నిర్ణయించింది. ఇలా నిర్ణయించడం యిదే ప్రథమం. సహజంగానే రష్యా దీనిని రెచ్చగొట్టే చర్యగా భావించి, గగనతలంలోనూ, సముద్రంలోనూ నిఘా చర్యలను పెంచింది. నాటో తన నూతన క్షిపణి వ్యవస్థను రొమేనియాలో నెలకొల్పింది. మరొక దానిని 2018లో పోలెండులో నెలకొల్పే అవకాశముంది. అయితే యీ చర్య, అణు ప్రమాదాన్ని నిరోధించే వుద్దేశంతో కుదుర్చుకున్న మధ్యంతర శ్రేణి అణుశక్తి ఒప్పందాన్ని పూర్తిగా వుల్లంఘిస్తున్నది.

మూడు బాల్టిక్ దేశాలైన ఇస్తోనియా, లాత్వియా, లిథూనియాలలో యుద్ధ బెటాలియన్లను నాటో నిలిపింది.

ఉక్రెయిన్ యిప్పటికీ నిప్పుల కొలిమిలా మండుతున్నది. ఉక్రెయిన్‌లోని ఫాసిస్టు ప్రభుత్వానికి అమెరికా పూర్తి మద్దతును యిస్తున్నది. రష్యాతో కలవాలన్న క్రీమియా సంకల్పానికి ఇంకా రాజీ పడలేదు.

**పశ్చిమాసియా, మధ్య ప్రాచ్యం :** ఇరాక్, అఫ్ఘనిస్థాన్‌ల నుంచి తన దళాలలో అత్యధిక భాగాన్ని వుపసంహరించినప్పటికీ, సిరియాలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోలేనప్పటికీ యీ ప్రాంతంలో అమెరికా సైనిక దురాక్రమణ వ్యూహాలు కొనసాగుతూనే వున్నాయి. నాలుగేళ్ళపాటు మారణహోమాన్ని సాగించినప్పటికీ, అమెరికా మద్దతువున్న అరేబియా, టర్కీవంటి అసాద్ వ్యతిరేక శక్తులు అసాద్‌ను తొలగించటంలో విఫలమయ్యాయి. ఈ క్రమంలోనే ఇస్లామిక్ స్టేట్ ఆవిర్భవించి గందరగోళాన్ని సృష్టించింది. అసాద్‌కు రష్యా మద్దతు లభించటంతో యుద్ధభూమిలో బలాబలాల పొందికలో మార్పు వచ్చింది. ఇరాన్ పూర్తి మద్దతును ప్రకటించటంతో అసాద్‌కు అనుకూలంగా పరిస్థితులు మారాయి. చిట్టచివరకు అసాద్‌ను కూలదోయాలన్న తన లక్ష్యాన్ని అమెరికా వదిలి వేసింది. కాగా యిప్పుడు ఇస్లామిక్ స్టేట్‌కు వ్యతిరేకంగా సాగే పోరాటాన్ని సమన్వయం చేసేందుకుగాను రష్యాతో చర్చల కోసం అమెరికా ఒత్తిడి తెస్తున్నది.

ఈ కాలంలో అనేక సమస్యలపై ప్రత్యేకించి ఉక్రెయిన్ పరిణామాలపై రష్యాకు, అమెరికా-నాటో కూటమికి మధ్య అనేక వుద్రిక్తతలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

అమెరికా-ఇజ్రాయెల్ మైత్రి మరింత బలపడి కొనసాగుతూ ఆ ప్రాంతంపై తమ పట్టును మరింత బిగించాయి. పాలస్తీనియన్లకు వారి సహజసంపదలు, నీటి వనరులు అందుబాటులో లేకుండా చేయాలన్న ప్రయత్నం జరుగుతున్నది. ఇదేవిధంగా పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దాడి కొనసాగుతున్నది. అమెరికా, నాటో మిత్రులు యిస్తున్న పూర్తి సహాయంతో సౌదీ అరేబియా పొరుగునే వున్న యెమెన్ సమాజాన్ని దాదాపుగా ధ్వంశం చేశాయి.

## శరణార్థుల సమస్య

అమెరికన్ సామ్రాజ్యవాద సైనిక బలగాల జోక్యం కారణంగా యీ ప్రాంతంలోని అనేక దేశాలలో సామాజిక సుస్థిరత, పౌర జీవనము భగ్నమయ్యాయి. ఇక్కడి ప్రజలు తీవ్రమైన బాధలకు, పేదరికానికీ, అభద్రతకూ గురవుతున్నారు. ఇరాక్ యుద్ధానంతరమూ,

ప్రస్తుత సిరియన్ ఘర్షణ కారణంగానూ యిక్కడి ప్రాంతమంతా దురభిమానాలతో విభజితమైంది. ఈ పరిస్థితి పెద్దయెత్తున మానవ సంక్షోభానికి దారితీసింది. యుద్ధంలో అట్టుడికిన తను మాతృభూమిని వదిలి వలసపోయే ప్రయత్నంలో వందలాది ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. వలస వాదుల బొరబాటుతో యూరప్‌లో సంక్షోభం ఏర్పడింది. బృహత్తరమైన వలసల కారణంగా ఐరోపాలో సంక్షోభం తలయెత్తింది. పెట్టుబడులకు సరిహద్దులను తెరిస్తే సంపద పెరుగుతుందంటూ ద్రవ్య పెట్టుబడిదారులు చేసే వాదనలలో పస లేదని తేలిపోయింది. 2015లో జర్మనీ పదిలక్షల మంది శరణార్థులను అనుమతించగా మిగిలిన ఐరోపా యూనియన్ దేశాలు వలసదారులను అనుమతించడానికి వెనుకాడాయి. లేదా అనుమతి నిరాకరించాయి. ఐరోపా యూనియన్‌లోని అంతర్గత వైరుధ్యాలను యీ సంఘటన తెలియ చెప్తున్నది. అంతే కాదు ఇందువలన ఈ దేశాలలో వలస వ్యతిరేక మితవాద శక్తులు బలాన్ని పుంజుకుంటున్నాయి.

## పెరుగుతున్న సైనికీకరణ

గతంలో మన పార్టీ మహాసభ పేర్కొన్నట్లుగా, అమెరికాతోపాటు యితర సామ్రాజ్యవాద దేశాలు సైనిక వ్యయాన్ని పెంచుతూ, ఒకానొక స్థాయిలో సైనిక పొత్తులు పెట్టుకుంటున్నాయి. ఇవన్నీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని పటిష్టం చేసే వుద్దేశంతో జరుగుతున్నాయి. సైనిక దురాక్రమణలు, జోక్యందారీ పద్ధతుల ద్వారా తమ లక్ష్యాన్ని నెరవేర్చు కోవాలని చూస్తున్నాయి.

సైనిక వ్యయాన్ని పెంచటానికి మరో కారణమేమంటే, పెట్టుబడిదారీ 'అధికోత్పత్తి' సంక్షోభాన్ని నివారించడానికి దీనిని విశ్వసనీయమైన మార్గంగా భావించడమే. సైనిక వ్యయం పెంపుదల, సైనిక పరిశ్రమలో ఉద్యోగాలను అవశ్యం చేస్తుంది. మానవ వినియోగానికి పనికి వచ్చే దేనినీ వీరు వుత్పత్తి చేయరు. కాని వీరు జీతం తీసుకోవడం దానిని ఖర్చుచేయడం వలన పెట్టుబడిదారీ విధానంలో సహజంగా జరిగే అధికోత్పత్తి వినియోగించబడుతున్నది.

ఇటువంటి సైనిక వుత్పత్తులను లాభాల కోసం కార్పొరేట్ సంస్థలు అమ్మే తీరాలి. ఆవిధంగా ప్రపంచ 'ఆయుధ బజార్లు' పుట్టుకు వస్తాయి. రక్షణ ఒప్పందాల కోసం ముమ్మరంగా బేరసారాలు ప్రారంభమవుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలను సృష్టించినపుడు మాత్రమే యిలాంటి ఆయుధ ఒప్పందాలు కుదురుతాయి. సామ్రాజ్యవాద సైనిక జోక్యాలు వీటికి మరింత ఊతమిస్తాయి. మనం ఇదివరకే అనుకున్నట్టు ప్రపంచ పెత్తనం కోసం కూడా సామ్రాజ్యవాదం యిటువంటి ప్రయత్నాలనే కొనసాగిస్తుంది.

మన పార్టీ మహాసభ అనంతర కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సైనిక వ్యయం వాస్తవంగా 1 శాతం పెరిగింది. 2015లో ప్రపంచంలో సైనిక వ్యయం 1,67,600 కోట్ల అమెరికన్ డాలర్లు. ఇది ప్రపంచ స్థూలదేశీయోత్పత్తిలో 2.3 శాతానికి సమానం. 2011 నుంచి 2014 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం తలయెత్తిన ఫలితంగా ఆ కాలంలో సైనిక వ్యయం కాస్త తగ్గుముఖం పట్టింది. కాని, ఆ తరువాత మరలా పుంజుకున్నది. 1990ల నుంచి యీ వ్యయం నిరంతరం పెరుగుతూనే వున్నది.

2016 జూలైలో నాటో విడుదల చేసిన సమాచారం ప్రకారం భాగస్వామ్య దేశాల సైనిక వ్యయం పెరిగింది. 2015లో 89,200 కోట్ల అమెరికన్ డాలర్లుగా వున్నదల్లా 2016 నాటికి 91,800 అమెరికన్ డాలర్లకు పెంచాలని యీ కూటమి లక్ష్యంగా పెట్టుకున్నది. నాటో సైనిక వ్యయంలో ఒక్క అమెరికా వాటాయే 72.2 శాతంగా వున్నది.

## ఆసియా-పసిఫిక్ ప్రాంతం

అమెరికా తన నౌకా బలంలో మూడింట రెండువంతులను పసిఫిక్ జలాల్లో మోహరించింది. భారత్, జపాన్‌లతో కూడిన త్రైపాక్షిక రక్షణ సహకార ఒప్పందాన్ని అమెరికా దృఢతరం చేసుకుంటున్నది. ఆస్ట్రేలియాతో కలుపుకుని యీ కూటమి దక్షిణాసియాలో బలాబలాల పొందిక అమెరికాకు అనుకూలంగా మార్చే ప్రమాదం ఏర్పడింది. అమెరికా ప్రస్తుతం ఆసియా పసిఫిక్ వ్యూహాన్ని ముందుకు తీసుకువచ్చింది. భారతదేశం కూడా అమెరికన్ సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉండేందుకు సిద్ధపడుతున్నది.

## దక్షిణ-చైనా సముద్రము

చైనాకు దాని పొరుగు దేశాలకు మధ్యవున్న వివాదాలలో అమెరికా సామ్రాజ్యవాదం తలదూర్చుతున్నది. ఇందులో భాగంగానే ఆగ్నేయ చైనా సముద్రంలో గస్తీ నౌకలను అమెరికా నిలిపింది.

దక్షిణ చైనా సముద్రంలోని వివిధ ద్వీపాలు, రాళ్ళగుట్టలు ఎవరికి చెందుతాయన్న విషయంపై యీ ప్రాంతంలోని వేర్వేరు దేశాల మధ్య వివాదాలు వున్నాయి. చైనా, ఫిలిప్పీన్స్, బ్రూనే, సింగపూర్, మలేషియా, వియత్నాంలు తమవంటే తమవంటూ పోటీపడుతున్నాయి. సముద్ర జలాలకు సంబంధించి ఐరాస తీర్మానం క్రింద న్యాయస్థానం మధ్యవర్తిత్వాన్ని స్వీకరించుదామన్న ఫిలిప్పీన్స్ వాదనను చైనా తిరస్కరించింది. ఈ న్యాయస్థానం ఫిలిప్పీన్స్‌కు అనుకూలంగా తీర్పుయిచ్చింది. కాని చైనా దానిని ఆమోదించలేదు. ఉభయ దేశాల

మధ్యా జరిగిన పలు ద్వైపాక్షిక ఒప్పందాలను ఫిలిప్పీన్స్ వుల్లంఘించిందనేది చైనా వాదన. అంతర్జాతీయ సంబంధాల నిర్దేశాలకు అనుగుణంగా ద్వైపాక్షిక సమస్యలపైనా, సముద్ర జలాల వివాదాలలోనూ తృతీయ పక్షం ఒప్పందాలను, పరిష్కారాలను అంగీకరించబోనని చైనా స్పష్టంచేసింది. ఐరాస చార్టర్‌ను అనుసరించి ద్వైపాక్షిక పరిష్కారాలకే తాను సుముఖమని చైనా చెప్తున్నది. కాగా, యీ ప్రాంతంలో నౌకల ప్రవేశాన్ని, విమానాల రాకపోకలను చైనా వ్యతిరేకిస్తున్నదంటూ అమెరికా తప్పుడు ప్రచారం చేస్తున్నది. మరోవైపున చైనా దక్షిణ చైనా సముద్రంలో నిర్భయంగా అంతర్జాతీయ నౌకల రాకపోకలకు ఏ ఆంక్షలు లేకుండా మార్గాలను ఏర్పరచుకునేందుకు సముద్రతీర దేశాలతోనూ అంతర్జాతీయ సమాజంతోనూ కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.

ఇదియిలా వుండగా నానాటికీ పెరుగుతున్న చైనా ఆర్థికశక్తినీ, యీ ప్రాంతంలో దాని వాణిజ్య సంబంధాలను 'కుదించాలని' అమెరికా కోరుకుంటున్నది.

ఇదే సమయంలో కొరియన్ సముద్ర జలాల్లో అమెరికా నౌకా విన్యాసాలను జరుపుతున్నది. ఈ ఏడాది యీ విన్యాసాలలో 80,000 మందికిపైగా అమెరికన్ సైనికులు పాల్గొన్నారు. ఉత్తర కొరియా అణు కార్యక్రమం పేరుతో దక్షిణ కొరియాలో క్షిపణి వ్యవస్థను అమెరికా నెలకొల్పింది. రష్యాను చుట్టుముట్టటం కూడా యీ వ్యూహంలో భాగంగా వున్నది.

## రష్యా-చైనా సహకారం

ప్రపంచ పెత్తనం కోసం అర్రులు చాస్తున్న అమెరికా ఎత్తుగడలకు ప్రతిగా రష్యా–చైనాలు పరస్పర సహకార సంబంధాలను పటిష్టం చేసుకునే దిశగా చర్యలు చేపట్టాయి. ఈ ఏడాది రష్యన్ ప్రధాని పుతిన్ చైనాను సందర్శించాడు. వ్యూహాత్మక స్థిరత్వాన్ని పటిష్టం చేసుకోవాలని, ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచు కోవాలని కోరుతూ వుభయ దేశాలూ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఇది, గమనించదగిన, హర్షణీయమైన పరిణామం.

## బహుళ ధ్రువత్వం

'ప్రచ్ఛన్న యుద్ధం ముగింపు' అనంతరం తన పెత్తనం కింద ఏకధ్రువ ప్రపంచ ఏర్పాటు కోసం అమెరికా సామ్రాజ్యవాదం సాగించిన ప్రయత్నాలకు ప్రతిగా బహుళధ్రువ ప్రపంచాన్ని బలోపేతం చేసేదిశగా బ్రిక్స్, ఐబిఎస్ఏ, బేసిక్ తదితరమైనవి ఆవిర్భవించాయి అని మన 21వ మహాసభలో వ్యాఖ్యానించాం.

ఆ తర్వాతి కాలంలోనే కొన్ని ప్రధానమైన మార్పులు కూడా సంభవించాయి. బ్రెజిల్, దక్షిణాఫ్రికాలలో సంభవించిన పరిణామాల కారణంగా పైన పేర్కొన్న వ్యాఖ్యానాలు అనిశ్చితిలో పడ్డాయి.

ఏదియేమైనప్పటికీ, రష్యా, చైనా సహకారమే కాకుండా మరికొన్ని ప్రయత్నాలు కూడా వునికిలోకి వస్తున్నాయి. దాదాపు 4,000 కోట్లకు పైగా స్థూల దేశీయోత్పత్తి కలిగిన రష్యా, ఆర్మేనియా, కజకిస్థాన్, బైలారస్ ఆర్థిక వ్యవస్థలను మాస్కో నాయకత్వంలోని యూరేషియన్ ఆర్థిక యూనియన్ కలిపి వుంచుతున్నది. ఇదియిలా వుండగా గత ఏడాది బీజింగ్‌లో నెలకొల్పిన ఆసియన్ మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకులో బ్రిటన్ వంటివాటితో సహా 57 దేశాలు సభ్యత్వాన్ని కలిగి వున్నాయి. అమెరికా అభ్యంతరాలను త్రోసిపుచ్చి బ్రిటన్ దీనిలో సభ్యత్వాన్ని తీసుకోవటం విశేషం. ప్రధానంగా చైనా చొరవ చూపిన న్యూ సిల్క్ రోడ్ ఎకనమిక్ బెల్ట్, 21వ శతాబ్దపు తీరప్రాంత సిల్క్ రోడ్‌ల –ఈ రెండింటిని కలిపి 'వన్ రోడ్, వన్ బెల్ట్' అని అంటున్నారు– పథకం సుమారుగా 440 కోట్ల జనాభా నివసిస్తున్న ఆసియా, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఐరోపాలలోని 65 దేశాలగుండా రహదారులు, రైలు మార్గాలు, ఓడరేవులు, పైపులైనులు నిర్మాణం చేపడతారు.

యూరేషియన్ సమ్మేళనం, రష్యన్ యూరేషియన్ ఎకనమిక్ యూనియన్ ద్వారా అలానే షాంఘై నేతృత్వంలోని సైనో–రష్యన్ సహకార సంఘం ఫలితంగా మహత్తరమైన రెండు యూరేషియన్ శక్తుల మధ్య, అంటే, రష్యా–చైనాల మధ్య ఆర్థిక సైనిక సహకారానికి సంబంధించి కొత్తగా ద్వైపాక్షిక ఒప్పందాలు కుదరనున్నాయి.

## సోషలిస్టు దేశాలు

**చైనా :** ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం కొనసాగుతున్న పూర్వరంగంలో చైనా ఆర్థిక పెరుగుదల మందగించి 6.7 శాతానికి తగ్గింది. అయితే యీ తగ్గుదల చైనా ప్రభుత్వం కోరుకున్నదే. రెండంకెల ఆర్థిక పెరుగదలను మందగింప చేసి, యీ ఏడాది 6.5 నుంచి 7 శాతం మధ్యకు తీసుకు రావాలన్న లక్ష్యాన్ని చైనా నిర్దేశించుకున్నది. వర్తమాన ప్రపంచ ఆర్థిక దృశ్యాన్ని గమనంలో వుంచుకున్న చైనా ప్రభుత్వం సేవారంగంపై దృష్టిని కేంద్రీకరించడం ద్వారా ప్రపంచ మాంద్యానికి విరుగుడు చర్యలను చేపట్టేందుకు ప్రయత్నించింది. ఈనాడు చైనా జిడిపిలో సేవారంగం సగభాగంగా వున్నది. ఉద్యోగాలలో అత్యధిక భాగం పట్టణ ప్రాంతాలకు చెందినవే. ప్రభుత్వ పెట్టుబడులను, మౌలిక సదుపాయాలను పెంచటం ద్వారా దేశీయ డిమాండును పెంచేటందుకు గత కొన్నేళ్ళుగా చైనా ప్రభుత్వం కృషి చేస్తున్నది. ప్రస్తుతం చైనా ప్రపంచంలోనే రెండవ

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలచింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పెద్దయెత్తున, అంటే, 3,20,000 కోట్ల డాలర్లు, లేదా చైనా స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం వరకు నిల్వ వున్నాయి.

**క్యూబా :** క్యూబా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల నెమ్మదిగా సాగుతూ, గత ఐదు సంవత్సరాలలో సగటున 2.9 శాతంగా వున్నది. 2015లో దాని వృద్ధిరేటు 4 శాతంగా వున్నప్పటికీ, 2016లో 2.6 శాతంగా ఉంటుందని అంచనా వేయడం జరిగింది.

క్యూబా కమ్యూనిస్టు పార్టీ గత మహాసభ, అంటే, ఏడవ మహాసభ "2030 వరకు కార్యక్రమం; క్యూబన్ సోషలిజం యొక్క సైద్ధాంతిక భావనలు" అన్న పత్రాన్ని ఆమోదించింది. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వమే ప్రధానంగా వుంటుందని, ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వేతరులు కూడా భాగస్వాములౌతారని పేర్కొన్నది. విద్య, వైద్య సంరక్షణ, సంస్కృతిక రంగాలలో అభివృద్ధి సాధించాలని సోషలిస్టు లక్ష్యాలకు ప్రాముఖ్యత కొనసాగుతున్నది. ఈ పత్రంపై ప్రస్తుతం క్యూబా సమాజంలోని అన్ని స్థాయిల్లోనూ పూర్తిస్థాయి చర్చసాగుతున్నది. ఈ చర్చలు అనంతరం పార్టీ కేంద్రకమిటీ వీటన్నింటినీ మదింపుచేసి యీ పత్రాన్ని ఖరారు చేస్తుంది. 2016 నాటికి యీ క్రమం యావత్తు ముగుస్తుంది.

54 ఏళ్ళ అనంతరం క్యూబా, అమెరికాల మధ్య దౌత్య సంబంధాలు తిరిగి నెలకొన్నాయి. గత 80 ఏళ్ళలో క్యూబాను సందర్శించిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడు ఒబామా. కాని, క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధనం యిప్పటికీ కొనసాగుతున్నది. గౌంటనామా బే యిప్పటికీ అమెరికా ఆక్రమణలోనే వున్నది. ఆర్థిక దిగ్బంధం కారణంగా క్యూబాకు కలిగిన నష్టాలకు అమెరికా నష్టపరిహారం చెల్లించాలన్న డిమాండుపై యిప్పటికీ క్యూబా పట్టుబడుతున్నది.

**వియత్నాం :** గత రెండేళ్ళుగా వియత్నాం 6 శాతం జిడిపీ పెరుగుదలను కొనసాగిస్తున్నది. ఈ ఏడాది 6.7 శాతం పెరుగుదల రేటును ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధేశించుకున్నది. దేశంలో కరువు తీవ్రత అధికంగా వుండటంతో 2015తో పోల్చుకుంటే యిప్పుడది 6.27 శాతంగా వున్నది. టిపిపి పై సంతకం చేసిన దేశాలలో వియత్నాం కూడా వుంది. 2016 జనవరిలో జరిగిన వియత్నాం కమ్యూనిస్టు పార్టీ 12వ మహాసభ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించటంతోపాటు, 2011-2015 మధ్య కాలంలో సామాజికార్థిక అభివృద్ధి అమలును కూడా సమీక్షించింది. 2016-2020 కాలానికిగాను గమన దిశను, కర్తవ్యాలను నిర్దేశించుకున్నది. పార్టీ నిర్మాణ నిర్ణయాల అమలు గురించి కూడా మహాసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ముసాయిదా నివేదికను మహాసభలో

ప్రవేశపెట్టటానికి కొన్ని నెలల ముందే చర్చల నిమిత్తం విడుదల చేశారు. దీనిపై విస్తృతంగా చర్చలు సాగాయి. దాదాపు 2.6 కోట్ల వ్యాఖ్యలు, సూచనలు వచ్చాయి. నివేదికను మహాసభ ఆమోదించటానికి ముందు వీటిని గురించి చర్చించింది. నిర్దిష్టమైన సామాజిక ఆర్థిక లక్ష్యాలను సాధించటంలో, ప్రత్యేకించి దేశాన్ని పారిశ్రామికీకరణ చేయటంలో వైఫల్యం వున్నట్లుగా నివేదిక పేర్కొన్నది. అలానే ఆర్థిక అసమానతలు పెరుగుతున్న విషయాన్ని కూడా గమనంలోకి తీసుకున్నది. రాజకీయ సిద్ధాంతాలలో, నైతికతలో, జీవనవిధానంలో క్షీణత, అలానే అలసత్వం, అవినీతి, వృధా చేయటం వంటి చెడుగులను గుర్తించి వీటిని వెనక్కు కొట్టవలసిన అవసరం వున్నదని నివేదిక పేర్కొన్నది.

చైనా ప్రధాని ఆహ్వానం మేరకు యిటీవలనే వియత్నాం ప్రధాన మంత్రి చైనాలో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చర్చల్లోనూ, సమావేశాల్లోనూ చైనా, వియత్నాం నాయకులు పలు అంశాలను చర్చించారు. సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని ప్రగాఢమొనర్చే విషయమై ఉభయ దేశాల నాయకులు ఒక అంగీకారానికి వచ్చారు. అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు. వియాత్నాం చైనాలు దౌత్యపరమైన గౌరవాలను నిలబెట్టుకోవాలని, చట్టపరంగా కొనసాగాలని, చర్చలద్వారా ఒప్పందాలు చేసుకోవాలని, దక్షిణ చైనా సముద్రానికి సంబంధించిన, అనుసరించవలసిన ప్రవర్తనా నియమావళిని రూపొందించుకోవాలని, తద్వారా విభేదాలు పెరిగి సంక్లిష్ట చర్యల అవసరం కలగ కుండా చూసుకోవాలని, శాంతి సుస్థిరతలు నెలకొల్పుకోవాలని ప్రతిజ్ఞ తీసుకొన్నారు.

**డిపిఆర్‌కె (ఉత్తర కొరియా) :** కఠినమైన ఆర్థిక ఆంక్షల కారణంగా ఉత్తర కొరియా ఏకాకిత్వాన్ని అనుభవిస్తున్నది. ఈ కాలంలోనే ఉత్తర కొరియా క్షిపణి వ్యవస్థలను, అణుశీర్షాలను పరీక్షించింది. ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. ఈ ప్రాంతంలో పెరుగుతున్న సైనిక వుద్రిక్తతలను యివన్నీ ప్రతిబింబిస్తున్నాయి. ఉద్రిక్తతల కారణంగా ఆరు దేశాల శాంతి చర్చలు, కొరియన్ ద్వీప ఏకీకరణ అంశాలు వెనక్కు పోయాయి.

## లాటిన్ అమెరికా

లాటిన్ అమెరికాలో వామపక్ష శక్తుల ముందంజ వేయటం ప్రపంచవ్యాప్తంగా వున్న సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకు, నయా ఉదారవాద వ్యతిరేక శక్తులకు స్ఫూర్తిదాయకంగా వున్నదని మన పార్టీ 20వ మహాసభ ఆమోదించిన కొన్ని సిద్ధాంత సమస్యలపై తీర్మానంలో పేర్కొన్నాము. ఈ సందర్భంగానే మనం యీ విధంగా పేర్కొన్నాము.

“లాటిన్ అమెరికాలోని పలు దేశాలలో ప్రజాతంత్ర ఎన్నికల్లో విజయాన్ని సాధించిన అనంతరం వామపక్ష లేదా పురోగామి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. కమ్యూనిస్టులుకూడా కలసివున్న యీ వామపక్ష సంఘటనలు పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణకూ, నయా ఉదారవాదానికి ఒక ప్రత్యామ్నాయాన్ని చూపుతున్నాయి. ఈ ప్రభుత్వాలు సోషలిస్టు ప్రత్యామ్నాయాలుగా వుండనప్పటికీ, సామ్రాజ్యవాదానికీ, నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ‘మానవీయ లక్షణాలను’ పెంపొందించడంలో సానుకూల పరిణామంగా వుంటాయి.”

**ఈ తరహా ప్రభుత్వాల భవితవ్యం గురించి మనం యింకా యిలా చెప్పాము :**

లాటిన్ అమెరికాలో ఈ ప్రభుత్వాలు విజయవంతంగా కొనసాగాలంటే సామ్రాజ్యవాదుల సవాళ్ళను ఎలా ఎదుర్కుంటారనే దానిపైన ఎలా అధికమిస్తారనే దానిపైన ఆధారపడి ఉంటుంది. అంటే రాజకీయ ఆధికత్యను నిరంతరం ధృఢంగా కొనసాగించాల్సి ఉంటుంది; రాజకీయాలు ఆర్థిక విధానాలను నిర్దేశించాల్సి ఉంటుంది. నిరంతరం సామ్రాజ్యవాద రాజకీయ ఆర్థిక అవసరాలను ఓడించాల్సి ఉంటుంది. సామ్రాజ్యవాదులు తమ ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు, తమకు అవసరమైన రాజకీయ ఆర్థిక విధానాలు కొనసాగింపచేసే ఎత్తుగడలను ఓడిస్తూనే ఉండాలి.

గత ఏడాది లాటిన్ అమెరికాలో తీవ్రమైన విఘాతాలే తగిలాయి. గత రెండు దశాబ్దాల కాలంలో చోటుచేసుకున్న వామపక్ష శక్తుల పురోగమనానికి ప్రమాదం ఎదురైంది. ఈ నాడు మితవాద శక్తులది పైచేయిగా ఉంది. ఈ ప్రాంతంలోని పలు దేశాలలో యిటీవల జరిగిన ఎన్నికలలో వామపక్షాలు ఎదురుదెబ్బలు తిన్నాయి. అర్జెంటీనాలో 2015లో జరిగిన ఎన్నికలలో మితవాదులు 51.4 శాతం ఓట్లను కైవశం చేసుకుని అధ్యక్ష పదవిని చేజిక్కించుకున్నారు. ఇది జరిగిన వెనువెంటనే స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలతో సహా పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలతో సంబంధాలు చేపట్టారు. గత కాలంలోని విజయాలు వెనక్కు నెట్టబడ్డాయి. లాటిన్ అమెరికాలో అమెరికన్ సామ్రాజ్యవాద ఆర్థిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆ ఖండంలోని వామపక్ష రాజకీయ శక్తులను కూడగట్టే ప్రయత్నానికి ఇది తీవ్ర విఘాతాన్ని కలిగించింది. బ్రెజిల్ అధ్యక్షురాలు

దిల్మా రౌసెఫ్ యిటీవల అభిశంసనకు గురయ్యారు. పాలక వర్గం కొమ్ముకాస్తున్న కార్పొరేట్ ప్రసారమాధ్యమం, కొంతమంది పోలీసు అధికారులు, న్యాయాధికారులు, అమెరికా పూర్తి వత్తాసు వుండటం కారణంగా యిది సాధ్యమైంది. బొలీవియాలో అధ్యక్షుడు ఈవో మొరేల్స్ రిఫరెండమ్‌లో ఓటమిపాలై మూడవసారి అధ్యక్ష పదవిని అందుకునే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. వెనిజులాలో 2015 నవంబరులో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మితవాద శక్తులు పెద్దయెత్తున ఆధిక్యతను సాధించాయి. దీనిని అవకాశంగా తీసుకుని మదురో అధ్యక్ష స్థానాన్ని అస్థిరపరచటానికి ప్రయత్నాలు జరిగాయి. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, చమురు ధరలు పడిపోవటం, అధిక ద్రవ్యోల్బణం, ఆహారము కొరత, నిత్యావసర సరకుల కొరత వుండటంతో  పార్లమెంటు ఎన్నికలలో అమెరికా మద్దతు వున్న మితవాదుల గెలుపు సాధ్యమైంది.

ఈ పరిణామాలన్నిటి కారణంగా లాటిన్ అమెరికా దేశాలు ముందుకు తెచ్చిన అభివృద్ధి కాముక, నయా ఉదారవాదేతర ప్రత్యామ్నాయానికి పెను సవాలు ఎదురైంది. అమెరికన్ సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా పురోగమన శక్తుల ఐక్యతకు కూడా దెబ్బతగిలింది. కాగా యిప్పుడు సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ప్రతిఘటించేందుకై ఉనికిలోకి వచ్చిన మెర్‌కోసుర్, సిలాక్, వునసుర్ వంటి వేదికల, ప్రాంతీయ వేదికల భవితవ్యం ప్రమాదంలో పడింది.

## పెరుగుతున్న ప్రతిఘటన

అమెరికా అండదండలతో ముందుకు సాగుతున్న వామపక్ష వ్యతిరేక శక్తుల ప్రయాణం ఏమంత సాఫీగా సాగటంలేదు. మితవాద శక్తుల రాజకీయ దాడులకు ప్రతిఘటన ఎదురవుతూనే వున్నది. అభ్యుదయ, వామపక్ష శక్తుల నేతృత్వాన ప్రజలు వీధుల్లోకి వచ్చి యీ దాడులను ప్రతిఘటిస్తున్నారు. అశాంతిని సృష్టించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా వెనిజులాలో ఛావిస్టాలు పెద్దయెత్తున ప్రదర్శనలు నిర్వహించారు. ఇదేవిధంగా బ్రెజిల్‌లో కూడా దిల్మా అనుకూల ప్రదర్శనలు జరిగాయి. ఆయనను అభిశంసించటాన్ని కుట్రపూరితమైన తిరుగుబాటుగా ప్రదర్శకులు పేర్కొన్నారు. అర్జెంటీనా అధ్యక్షుడు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, సమాజంలోని యితర బృందాలు నిరసనలు తెల్పుతున్నాయి.

## కొలంబియా శాంతి ఒప్పందం

కొలంబియాలో వివాదాలను తొలగించి, సానుకూలమైన, సుదీర్ఘశాంతి నెలకొల్పేలా ప్రభుత్వమూ, విప్లవ సైనిక దళాలు –ప్రజా సైన్యం– సంపూర్ణమైన, నికరమైన,

నిర్దిష్టమైన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. 2016 ఆగస్టు 24న క్యూబాలోని హవానాలో యీ ఒప్పందాన్ని ప్రకటించారు. కొలంబియాలో అర్ధ శతాబ్దంగా కొనసాగుతున్న సాయుధ సంఘర్షణకు యీ ఒప్పందం స్వస్తి పలకగలదు. హామీదారులుగా యీ ఒప్పందంపై క్యూబా, నార్వేలు సంతకాలు చేశాయి. కొలంబియాలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణద్వారా దేశ పౌరుల ఆమోదాన్ని పొందిన తరువాత మాత్రమే యీ ఒప్పందం అమలులోకి వస్తుంది. ఈ ప్రక్రియ జయప్రదమయ్యేటట్లయితే అది లాటిన్ అమెరికాకు పెద్ద విజయం కాగలదు. ఈ మొత్తం వ్యవహారంలో సోషలిస్టు క్యూబా ప్రముఖ పాత్రను నిర్వహించింది.

**ఆఫ్రికా**

ఆఫ్రికాలోని పలు దేశాలలో రాజకీయ, సామాజిక, ఆర్థిక అస్థిరత్వం కొనసాగుతూ మరింత తీవ్రమవుతున్నది. సామ్రాజ్యవాదుల నిరంతర జోక్యమూ,ఉగ్రవాద సంస్థలకు వారిచ్చే మద్దతు కారణంగానే యీ పరిస్థితి నెలకొన్నది.

సామ్రాజ్యవాదులు రగిలించిన అంతర్యుద్ధం కారణంగా ఐదేళ్ళ క్రితం సూడాన్ దేశం ఉత్తర, దక్షిణ సూడాన్‌లుగా విడిపోయింది. కాగా, యిప్పుడు కొత్తగా ఏర్పడిన దక్షిణ సూడాన్ అంతర్యుద్ధ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. గత నెలలో దేశంలో అత్యధిక భాగంలో హింస చెలరేగింది. అంతర్యుద్ధాన్ని ముగిస్తూ చేసుకున్న శాంతి ఒప్పందం ఎందుకూ పనికిరాకుండా పోయింది. దాదాపు రెండేళ్ళపాటు బొకో హరామ్ ఉగ్రవాద సంస్థ సాగించిన భీతావహ హింసాత్మక దాడులతో తల్లడిల్లిన నైజీరియా ప్రస్తుతం కరువుకు చేరువైంది. తక్షణమే ఆహారం అందని పక్షంలో 50,000 మందికి పైగా పిల్లలు ఆకలితో చనిపోవటం ఖాయమని యునిసెఫ్ అంచనా వేసింది. దేశంలోని ఒక రాష్ట్రంలో సుమారుగా 2,50,000 మంది తీవ్ర పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కరువు రక్కసికి చిక్కి దాదాపు 44 లక్షలమంది సంక్షోభం వల్ల నానాయాతనలు ఎదుర్కొంటున్నారు. దేశంలో సగభాగంలోకి సహాయ సంస్థలు వెళ్ళలేక పోతున్నాయి. సోమాలియాలో తీవ్రవాదుల హింసాకాండ కొనసాగుతున్నది. రాజధాని నగరమైన మొగదిషుతోసహా యితర పట్టణాలలో యీ దాడులు జరుగుతున్నాయి. సోమాలియాలోని వివిధ ప్రాంతాలలో ఐరాస మద్దతు వున్న ఆఫ్రికా యూనియన్‌సైన్యాలకూ, ఇథియోపియన్ సైన్యాలకూ వ్యతిరేకంగా షబాబ్ తీవ్రవాదులు పోరాడుతున్నారు. ఎల్లెడెలా బయల్పడిన కుంభకోణాలతో పాటు యిటీవలి ఎన్నికలలో జరిగిన అక్రమాల కారణంగా గబన్, జాంబియా వంటి దేశాలు అతలాకుతలమవుతున్నాయి.

దక్షిణాఫ్రికాలో జరిగిన స్థానిక ఎన్నికలలో అధికార ఏఎన్‌సీ బలం తగ్గుతూ వచ్చింది. జాత్యహంకార ప్రభుత్వం కుప్పకూలిన అనంతరం 1994లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల తరువాత యింత తక్కువ ఓట్లు ఎప్పుడూ రాలేదు. దానికి 52 శాతం ఓట్లు వచ్చినప్పటికీ యివి చాలాతక్కువ. నిరుద్యోగం పెరుగుదల, నిజ వేతనాల తగ్గుదల, ప్రజలందరికీ గృహవసతి అన్న వాగ్దానాన్ని నెరవేర్చక పోవటం వంటివన్నీ ప్రజలలో వ్యతిరేకతను తీసుకు వచ్చాయి.

ఇంతకు ముందే మనం చాలా సందర్భాలలో విశ్లేషించుకున్నట్లుగా సంక్షోభాల సమయంలో, ప్రజలలో పెరిగిన అసంతృప్తిని వామపక్ష శక్తులు నిర్మాణాత్మక పోరుబాటను పట్టించటమో, లేకుంటే మితవాదులు తమ పురోగమనానికి ప్రజల అసంతృప్తిని సొమ్ము చేసుకోవటమో జరుగుతుంది. ప్రజా పోరాటాలకు శ్రీకారం చుట్టాలన్నా, ఆ ప్రజా పోరాటాలకు నేతృత్వం వహించాలన్నా ఆయా దేశాలలో కమ్యూనిస్టులు, వామపక్షవాదులు వునికిలో వుండటమూ, శక్తిమంతులుగా వుండటమూ అత్యంత కీలకమైన విషయం. కమ్యూనిస్టులు, వామపక్షవాదులు ఎన్నికలలో తమ ప్రభావాన్ని నిలుపుకుంటున్నప్పటికీ ప్రజాపోరాటాలను వామపక్షాలు తమ మార్గంలో నడపటానికి యీ బలం చాలదు.

## మన ఇరుగుపొరుగు

మన పొరుగు దేశాలలోని పరిణామాలు 21వ మహాసభ నిర్ధారణలను బలపరిచేవిగా వున్నాయి. గత రెండేళ్ళ బిజెపీ పాలనలో యీ ప్రభుత్వం అనుసరించే విదేశాంగ విధానం కారణంగా మన పొరుగు దేశాలతో సంబంధాలలో ఒడుదుడుకులు చోటుచేసుకున్నాయి.

ఎట్టకేలకు నేపాల్ దేశం లౌకిక, ప్రజాతంత్ర, సర్వసత్తాక రాజ్యాంగాన్ని 2015 సెప్టెంబరులో ఆమోదించింది. రాజరికం కుప్పకూలిన తరువాత గత పదేళ్ళలో తొమ్మిది ప్రభుత్వాలు మారాయి. దేశంలో నెలకొన్న రాజకీయ అస్థిరతను యిది తెలియచెప్తున్నది. ఈ అస్థిరత కారణంగా రాజ్యాంగం ఆమోదానికి చాలా జాప్యం జరిగింది. రాజ్యాంగంలోని కొన్ని అంశాలకు అభ్యంతరాలు తెలిపిన మధేశీ పార్టీలు రాజ్యాంగ ఆమోదం కోసం నిర్వహింమచిన ఓటింగ్‌లో పాల్గొనలేదు, పైగా పెద్దయెత్తున నిరసన ప్రదర్శనలను నిర్వహించింది. రాజ్యాంగం ఆమోదం పొందిన తరువాత నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు లెనినిస్టు ఐక్య సంఘటన) నేతృత్వాన నూతన ప్రభుత్వం ఏర్పడింది. దేశ ప్రధాన మంత్రి, అధ్యక్షుడు యిరువురూ యీ పార్టీకి చెందినవారే. కొన్ని నెలలోనే సిపిఎన్ (ఎమ్–సి) శాసన సభలో బలాన్ని కోల్పోవటంతో యీ ప్రభుత్వం రాజీనామ

చేయవలసి వచ్చింది. కాగా, పుష్ప కమల్ దహల్ (ప్రచండ) నాయకత్వంలోని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు సెంటర్), నేపాలీ కాంగ్రెసు మద్దతుతో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జాతీయ, ప్రాంతీయ, స్థానిక ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కొత్తగా ఆమోదించిన రాజ్యాంగం ఆదేశిస్తున్నది. కాని యిది పూర్తిగా అనిశ్చితంగా కనపడుతున్నది. భారత ప్రభుత్వం రహదారిని నిర్బంధించిదని, తత్కారణంగా నేపాల్ వాణిజ్యమూ, సరకుల రవాణా దారుణంగా దెబ్బతిన్నదని కనుక భారతదేశమే యీ పరిణామాలకు బాధ్యత వహించాలని నేపాలీయులు భావిస్తున్నారు, అయితే భారత ప్రభుత్వం దీనిని త్రోసిపుచ్చింది. ఈ కారణాలన్నింటి తోపాటు ప్రజల అవసరాలను ప్రభుత్వం పోతున్నందువలన మితవాదులు, రాజరికాన్ని సమర్ధకులు యీ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

ఈ కేంద్ర కమిటీ సమావేశం ముగుస్తున్న సమయంలోనే, నేపాల్ నూతన ప్రధాని మొట్టమొదటిసారిగా భారత్‌లో అధికారికంగా పర్యటించారు. భారతదేశానికి అత్యంత ఆప్తమిత్రునిగా, సహచరునిగానూ మిగిలి పోవాలన్న నేపాల్ ఆకాంక్షను ఆయన భారతదేశానికి తెలియచేశాడు. ఇటీవలి కాలంలో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భారత వ్యతిరేక ప్రచారాన్ని సాగించిన విషయాన్ని దృష్టిలో వుంచుకున్నపుడు యీ ప్రకటనకు ప్రాధాన్యత వుంటుంది. ఈ పర్యటనకు సంబంధించిన సమాచారం మొత్తం అందుబాటులోకి వచ్చిన తరువాత తుది అంచనాను వేయటం జరుగుతుంది.

బంగ్లాదేశ్‌లో మతఛాందసవాద శక్తులు, ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాలను ముమ్మరంగా సాగిస్తున్నాయి. లౌకికవాద రచయితలను, బ్లాగర్లను వారు తమ లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉగ్రవాదుల కార్యకలాపాల్లో వందలమంది ప్రాణాలను కోల్పోతున్నారు. బంగ్లాదేశ్ విముక్తి యుద్ధ సమయంలో ఇస్లామిక్ నాయకులు చేసిన యుద్ధనేరాలకుగాను వారిపై విచారణ చేయాలని బంగ్లా ప్రభుత్వం నిర్ణయించడంతో హింసాత్మక ప్రతిఘటన ఎదురైంది. తీవ్రవాద, ఉగ్రవాద శక్తులు పెరగటంవల్ల మన దేశంపై, ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాలపై యీ ప్రభావం పడింది. ఛాందసవాద శక్తులను బోనులో నిలబెట్టాలని వారిపై చర్యలు తీసుకోవాలన్న బంగ్లా ప్రభుత్వ నిర్ణయం మెచ్చదగినదే. అయితే అదే సమయంలో ఆర్థికపరంగా ప్రజలలో పెరిగిన అసంతృప్తిని యీ ఛాందసవాద, ఉగ్రవాద శక్తులు వుపయోగించు కోకుండా ప్రభుత్వం చూడాలి. అలానే, యిప్పటికే దెబ్బతిన్న లౌకిక రాజకీయ వ్యవస్థను యీ శక్తులు మరింతగా దెబ్బతీయకుండా చూడాలి.

పాకిస్థాన్‌లో మతఛాందసవాద శక్తుల ప్రభావం బలంగా వుండటంతో అక్కడ

సంక్లిష్ట పరిస్థితులు కొనసాగుతూనే వున్నాయి. తీవ్రవాదులు అమాయక ప్రజల ప్రాణాలు బలితీసుకుంటేనే ఉన్నారు. దేశ వ్యవహారాలలో సైన్యం కీలక పాత్రను నిర్వహిస్తూనే వున్నది. కాశ్మీర్ వ్యవహారంలో తలదూర్చటానికీ, దానిని అంతర్జాతీయం చేయడానికీ ప్రస్తుతం అక్కడ నెలకొన్న అశాంతి పాక్‌కు మంచి అవకాశాన్ని కల్గిస్తున్నది. బిజెపీ అనుసరిస్తున్న విధానాల కారణంగా భారత-పాకిస్థాన్ సంబంధాలు మరింతగా క్షీణిస్తున్నాయి.

ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు మరోసారి పుంజుకుంటున్నారు. దేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా ప్రధాన పాత్రను నిర్వహిస్తూనే వున్నది.

మాల్దీవుల్లో మహమ్మద్ నషీద్ నాయకత్వాన ఏర్పడిన మొట్టమొదటి ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని 2012 ఫిబ్రవరిలో కూలదోయడంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొన్నది. అత్యంత వివాదాస్పదమైన ఎన్నికలలో అధికారాన్ని చేపట్టిన అబ్దుల్లా యమీన్ తన అధికారాన్ని వుపయోగించి నషీద్‌కు 13 ఏళ్ళ జైలు శిక్ష విధించాడు. ప్రజలలో పెరిగిన అసంతృప్తిని అణచేందుకు ఆయన చేపట్టిన చర్యలు అంతర్జాతీయంగా అసంతృప్తికి గురైనాడు. ఇక్కడ రాడికల్ ఇస్లాం అంతకంతకూ పెరుగుతున్నది. దేశాధ్యక్షుడు గత ఏడాదిలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులతోపాటు దేశ ఉపాధ్యక్షుడినీ, రక్షణ మంత్రినీ, పోలీసు వున్నతాధికారినీ అరెస్టు చేయించాడు.

**శ్రీలంక :** సరికొత్త రాజ్యాంగ రూపకల్పనకుగాను శ్రీలంక ఫ్రీడం పార్టీ, యునైటెడ్ నేషనల్ పార్టీలతో కూడిన జాతీయ సమైక్యతా ప్రభుత్వం ఒక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రజలలోని వివిధ తరగతుల రాజకీయ అభిప్రాయాలను యీ కమిటీ ప్రతిబింబించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. 2016 నవంబరులో యీ నూతన రాజ్యాంగం పార్లమెంటు ఆమోదాన్ని పొందవలసి వుంటుంది, 2017 జనవరిలో దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ జరగనున్నది.

దశాబ్దాల తరబడి సాగిన సుదీర్ఘ అంతర్యుద్ధ కాలంలో 'దారుణమైన వుల్లంఘనలు' జరిగాయని 2015 నాటి ఐరాస నివేదిక పేర్కొన్నది. ఈ సందర్భంగా జరిగిన నేరాలను విచారించేటందుకోసం ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని, దీనిలో కొంతమంది విదేశీ న్యాయమూర్తులను కూడా నియమించాలని యీ నివేదిక పేర్కొన్నది. అంతర్జాతీయ న్యాయమూర్తులు, ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, పరిశోధకులతో కూడిన మిశ్రమ న్యాయమూర్తులతో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసినపుడే 'న్యాయానికి చేరువయ్యేందుకు అవసరమైన మరో ముందడుగు' అని యీ నివేదిక పేర్కొన్నది. నిజ నిర్ధారణకు ప్రణాళికలు సర్దుబాటుకు కమీషన్ నేర న్యాయవ్యవస్థ

నిర్మూలించడం, బాధితులకు నష్టపరిహారాన్ని ఇవ్వడం  వంటి ప్రయత్నాలు నూతన ప్రభుత్వం చేస్తున్నపుడే యీ నివేదిక వెలువడింది.

**మైన్మార్ :** ప్రజా ప్రతినిధిగా ప్రప్రథమంగా ఎన్నికైన అంగ్ శాన్ సూ కీ 1962 నుంచి ప్రజానేతగా కొనసాగుతున్నారు. అధికారికంగా ఆమెను 'మైన్మార్ ప్రభుత్వ సలహాదారు' అని పిలుస్తున్నారు. తరతరాలుగా మైన్మార్‌లో నివసిస్తున్న రోహింగ్యా ముస్లింలను పౌరులుగా గుర్తించటానికి ఆమె తిరస్కరిస్తున్నారు. పౌరసత్వం, దైవారాధన, విద్య, వివాహం, ప్రయాణం వంటి ప్రాథమిక హక్కులు కూడా రోహింగ్యాలకు లేవు. 2012లో హింసాకాండ చెలరేగిన సమయంలో దాదాపు లక్ష రోహింగ్యాలు ఇళ్ళను విడచి పునరావాస శిబిరాలలో తలదాచుకున్నారు. వీరంత బెంగాలీలని సరిహద్దులు దాటిన అక్రమ వలసవాదులని బౌద్ధ భిక్షువుల వాదన. బౌద్ధమత ఛాందసులు యిప్పటికీ రోహింగ్యాలపై దాడులను కొనసాగిస్తూనే వున్నారు.

## కార్మికవర్గ అంతర్జాతీయత

### అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమం

అనేక దేశాలలో కమ్యూనిస్టు, కార్మిక పార్టీలు పరిమిత బలాన్నే కలిగి వున్నప్పటికీ ఆయా దేశాలలో అవి  క్రియాశీలంగానే వున్నాయి. గ్రీస్, పోర్చుగల్, రష్యా, చెక్ రిపబ్లిక్, సైప్రస్, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, నేపాల్, జపాన్ వంటి కొన్ని పెట్టుబడిదారీ దేశాలలో వారు ప్రధానమైన రాజకీయ శక్తిగా వున్నారు. ఎక్కువ భాగం కమ్యూనిస్టు పార్టీలు ఏడాదికొకమారు సమావేశమై సమాచారాన్ని, అభిప్రాయాలను, తమతమ దేశాలలోని అనుభవాలను పరస్పరం తెలియ చేసుకుంటారు. సోవియట్ యూనియన్ కనుమరుగైన అనంతరం, 1993లో 'వర్తమాన ప్రపంచ పరిస్థితి' అన్న అంశంపై మనమొక సెమినార్‌ను నిర్వహించాము. ఇది సోవియట్ పతనానంతరం పెద్ద కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలన్నింటినీ ఒకచోటికి చేర్చేందుకు ఎంతో తోడ్పడింది. అప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్ణీత వ్యవధిలో నిర్వహించాలన్న ప్రతిపాదన వచ్చింది. 1999లో గ్రీసు కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) చొరవ తీసుకుని అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక పార్టీల (ఐఎంసిడబ్ల్యుపి) వార్షిక సమావేశాల నిర్వహణకు పూనుకున్నది. మొదటి ఏడు సమావేశాలు ఏథెన్స్‌లో జరిగాయి. అయితే అన్ని ఖండాలలోనూ నిర్వహించాలన్న మన ప్రతిపాదన మేరకు యీ సమావేశాలు విభిన్న దేశాలలో జరిగాయి. 11వ సమావేశాన్ని మనము, సిపిఐ కలసి మన దేశంలోనే నిర్వహించాము. 2017లో అక్టోబరు విప్లవ సందర్భాన్ని పురస్కరించుకుని తదుపరి సమావేశాన్ని రష్యాలో జరపాలని నిశ్చయించారు.

కమ్యూనిస్టు, కార్మిక పార్టీలు నిర్వహించే యిలాంటి సదస్సులకు నిర్మాణ రూపాన్ని

యిచ్చేందుకుగాను ప్రపంచం లోని వివిధ ప్రాంతాలలో ప్రయత్నాలు సాగుతున్నాయి. ఉదాహరణకు, బాల్కన్ ప్రాంతంలోనూ, ఐరోపాలోనూ క్రమబద్ధంగా యిలాంటి సదస్సులు జరుగుతున్నాయి. లాటిన్ అమెరికాలో పలు కమ్యూనిస్టు పార్టీలు సరికొత్త వామపక్ష వుద్యమాలతోనూ, శక్తులతోనూ కలసి సన్నిహితంగా పనిచేస్తున్నాయి. ఆఫ్రికాలో సైతం దక్షిణాఫ్రికన్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్ఏసిపి) చొరవ తీసుకుని వివిధ వామపక్ష బృందాలను, పార్టీలను కలుపుకు వస్తున్నది. వామపక్ష శక్తులతో కూడిన సౌ పౌలో వేదిక వంటివాటితో యిలాంటి సదస్సులను నిర్వహించే సుదీర్ఘ సంప్రదాయం లాటిన్ అమెరికాకు వున్నది. మన ప్రాంతంలో కూడా కమ్యూనిస్టు, కార్మిక పార్టీలతో యిలాంటి సదస్సులను, సమావేశాలను నిర్వహించవలసి ఉంది. సార్క్ ప్రాంతంలో ఇటువంటి సమావేశాలు ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలని వివిధ కమ్యూనిస్టు పార్టీలు మన పార్టీని కూడా డిమాండు చేస్తున్నాయి.

## కార్మికవర్గ పోరాటాలు

ఈ కాలంలోనే ప్రపంచంలోని పెట్టుబడిదారీ దేశాలన్నిటా శ్రమకూ, పెట్టుబడికీ, లేదా, శ్రామిక జనులకూ, పాలకవర్గాలకూ మధ్య వైరుధ్యాలు తీవ్రతరమయ్యాయి. జర్మనీలో అమెరికాకు చెందిన బ్రహ్మాండమైన కార్పొరేట్ సంస్థ అమెజాన్ గిడ్డంగులలో సమ్మెలతో 2015వ సంవత్సరం ముగిసింది. లుఫ్తాన్సా విమానయాన శ్రామికులు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన కార్మికులు ఆందోళన బాటను చేపట్టారు. తపాల కార్మికులు, కిండర్‌గార్డెన్, నర్సరీ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల ఆందోళనతో జర్మనీ అట్టుడికింది. అమెరికాలో ఆటోమొబైల్, ఉక్కు, చమురు పరిశ్రమల్లో పెద్దయెత్తున సమ్మెలు జరిగాయి. గ్రీసులో రైల్వే కార్మికులు ఐదు రోజుల సమ్మె చేశారు. ఇదేవిధంగా ప్రపంచంలోని పలు ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు జరిగాయి. పొదుపు చర్యలకు వ్యతిరేకంగా పారిస్‌లో దాదాపు పది లక్షలమంది శ్రామికులు పెద్దయెత్తున ప్రదర్శన చేశారు. ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

ఐరోపా అంతటా పొదుపు చర్యలకు వ్యతిరేకంగా పెద్దయెత్తున ప్రదర్శనలు జరిగినప్పటికీ, ఐరోపాలోని రాజధాని నగరాలలో మున్నెన్నడూ లేని ప్రజాందోళనలు చోటుచేసుకున్నాయి. యివన్నీ స్వీయరక్షణ నిమిత్తమే జరిగాయి. అంటే, ప్రస్తుతం వున్న జీవనోపాధి స్థాయిని ఎదుర్కొనేందుకు కష్ట జీవులు సంపాదించుకున్న ప్రజాతంత్ర హక్కులను రక్షించు కోవడానికే వీరు ఆందోళన బాటపట్టారు. ఏదియేమైనప్పటికీ, ఈ పోరాటాలు సామ్రాజ్యవాదాన్ని తీవ్రతరమవుతున్న పెట్టుబడిదారీ దోపిడీని ప్రతిఘటించేందుకు ప్రాతిపదికగా మారుతాయి.

ఈ పరిస్థితులలో 20, 21వ మహాసభలలో మన నిర్ధారణలు వాస్తవమేనని పైన తెలిపిన అంశాలు రుజువు చేశాయి. కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు పెట్టుబడిదారీ వ్యవస్థకు రాజకీయ ప్రత్యామ్నాయాన్ని పటిష్ట పరచకుండా, పోరాటాలను ఉధృతం చేయకుండా, కార్మిక వర్గ నాయకత్వాన పెట్టుబడిదారుల పాలనపై ప్రజలలో రగులుతున్న అసంతృప్తిని సరైన మార్గంలో పెట్టకుండా, పెట్టుబడిదారీ విధానాన్ని, అది నిర్దయగా సాగించే దోపిడీని సవాలు చేయటం సాధ్యం కాదు.

## ముగింపు

పైన పేర్కొన్న పరిణామాలన్నిటినీ దృష్టిలో వుంచుకుని చూసినపుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నేతృత్వంలో సాగుతున్న ప్రపంచీకరణా, దానితోపాటే నయా ఉదారవాద కార్యక్రమమూ కలసి ప్రపంచవ్యాప్తంగా వున్న కార్మిక శ్రేణులపై అంతకంతకూ పెనుభారాన్ని మోపుతున్నట్లు అర్థం కాగలదు. ప్రపంచ పెత్తనాన్ని మరింత దృఢతరం చేసుకోవటానికీ, ప్రస్తుతం నెలకొనివున్న ఆర్థిక మాంద్యాన్ని తప్పుకునేందుకు అమెరికన్ సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాలు సహజంగానే వేర్వేరు ప్రాంతాలలో అస్థిరతను సృష్టిస్తున్నాయి. అమెరికన్ సామ్రాజ్యవాదం తన పెత్తనం కోసం, తనను బలపరచుకునేందుకు, ఐరోపాలో రష్యా పరపతిని తగ్గించాలని చైనా అభివృద్ధిని నిలుపుచేయాలని తద్వారా తనకు భవిష్యత్తులో పోటీలేకుండా చూసుకోవాలని ప్రయత్నిస్తున్నది.

భారతదేశంలో తనను తాను బలోపేతం చేసుకోవటంద్వారా, ఆర్థిక, రాజకీయ తదితర దాడులకు వ్యతిరేకంగా భారత ప్రజలు సాగించే పోరాటాలను విస్తృతమూ, శక్తివంతమూ చేయగల సామర్థ్యాన్ని పెంచుకోవటం ద్వారా అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమంలో భాగస్వామిగా సిపిఎం కూడా ప్రపంచ పోరాటాలకు తనవంతు కృషిని జతచేస్తుంది.

♦ ♦ ♦

# జాతీయ పరిస్థితి

**జూ**న్ 2016లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశాలలో కొన్ని ముఖ్యమైన జాతీయ రాజకీయ పరిణామాలను మనం చర్చించాము. జూన్ కేంద్ర కమిటీ సమావేశాల తర్వాత జాతీయ రంగంలో వచ్చిన కొన్ని ముఖ్యమైన పరిణామాల గురించి ఇప్పుడు చర్చించుకుందాం.

ఈ కాలంలో స్థూలంగా ప్రజల జీవన ప్రమాణాలు తరిగిపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో మునిగి అశేష ప్రజానీకంపై మరిన్ని భారాలు పడుతున్నాయి. దేశ విదేశాంగ విధానం అస్థవ్యస్థంగా ఉంది. సామాజిక జీవనం చిన్నాభిన్నమైంది.

**ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు :**

ప్రభుత్వం స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల గురించి గొప్పలు చెప్పుకుంటూ ఈ సంవత్సరం జిడిపి వృద్ధి 7.1% ఉందని అధికారికంగా అంచనా వేసారు. కానీ వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ గణాంకాలు అనుమానాస్పదంగా ఉన్నాయని మనం ఇది వరకు చెప్పాము. మనం చెప్పిన దానిని అంతర్జాతీయ సంస్థలు ధృవీకరించాయి. బిజెపి ప్రభుత్వం నూతన పద్ధతిలో లెక్కలు గట్టి జిడిపి వృద్ధి 7.1% ఉన్నదని చెప్తుందని అయితే పాత పద్ధతిలో లెక్కలు కడితే జిడిపి వృద్ధి రేటు 4.3% మాత్రమే ఉంటుందని ఫైనాన్షియల్ టైమ్స్ తెలియచేసింది.

భారతీయ పారిశ్రామిక రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయి ఉందని తాజా గణాంకాలు తెలియచేస్తున్నాయి. జూలై మాసంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచిక 2.4% వృద్ధిరేటును, ఉపాధి కల్పనకు కీలకమైన తయారీ రంగం 3.4% వృద్ధిరేటును సూచిస్తున్నది. 22 ప్రధానమైన తయారీ రంగ పరిశ్రమలలో 12 పరిశ్రమలలో వృద్ధిరేటు పూర్తిగా పడిపోయినట్టు నమోదయ్యింది. అంతకటే భవిష్యత్తు ఇంకా

అంధకారమయంగా చూపించే విషయం ఏమిటంటే క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ప్రమాద ఘంటికలు మోగిస్తూ జూలైకి 29.6 శాతం తరుగుదలగా నమోదైంది. ఈ తరుగుదల జూన్ మాసంలో 16.5 శాతంగా ఉండింది. క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తిలో తరుగుదల అంటే కొత్తగా ఏ పెట్టుబడులు రావడం లేదని అర్థం.

ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాల పనితీరును బట్టి పారిశ్రామిక రంగ సంక్షోభాన్ని మనం గమనించవచ్చు. పారిశ్రామిక కార్యకలాపాలకు కీలకమయిన విద్యుత్ ఉత్పత్తి 2016 సంవత్సరపు మొదటి ఆరు నెలలో 9% వృద్ధిని సూచించింది. జూలై మాసంలో ఇది 1.6% కి పడిపోగా, ఆగస్టులో 0.15%కి పడిపోయింది. గత ఏడేళ్ళలో ఈ వృద్ధిరేటు అత్యంత తక్కువ అని కేంద్ర విద్యుత్ అథారిటీ  తెలియచేసింది. ఇదే రకమైన సంక్షోభిత పరిస్థితులు మొత్తం ఇంధన రంగంలో కనబడుతున్నాయి. రేల్వేలు సంక్షోభంలో ఉన్నాయి. జూలై 2016లో భారతీయ రైల్వేల సరుకు రవాణా ఆదాయం 9.68%కి పడిపోయింది. ఇది వస్తువుల రవాణాలో పతనాన్ని సూచించడంతో పాటు మొత్తం మీద పారిశ్రామిక మాంద్యాన్ని సూచిస్తున్నది. ఆదాయంలో వచ్చిన నష్టాన్ని పూరించుకోవడానికి ప్రయాణికులపై భారాలు వేస్తున్నారు. తాజాగా **'సర్జ్ ప్రైసింగ్'** ను ప్రవేశపెట్టి 90% ప్రయాణికుల ప్రయాణ ఛార్జీలను గణనీయంగా పెంచారు. పరిశ్రమలకు బ్యాంకులు ఇచ్చే ఋణాలు అతి తక్కువ స్థాయికి పడిపోయాయి. ఇది పారిశ్రామిక సంక్షోభాన్ని సూచిస్తున్నది. అట్లాగే ఇది ఉపాధి కల్పనపై కూడా ప్రభావాన్ని చూపుతుంది.

ప్రధాన పరిశ్రమలలో 2015 లో1.35 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించాలని ప్రభుత్వం అధికారికంగా పార్లమెంటులో ప్రకటించింది. ప్రతి సంవత్సరం 1.3 కోట్ల యువత కొత్తగా ఉపాధి మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఈ సందర్భంగా ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానన్న మోడీ వాగ్దానాన్ని మనం జ్ఞాపకం చేసుకోవాలి.

## వ్యవసాయ సంక్షోభం

వ్యవసాయ సంక్షోభం తీవ్రతరమవ్వడం కొనసాగుతున్నది. గ్రామీణ నిజవేతనాలు పడిపోతున్నాయి. అక్టోబర్ 2015 నుంచి రూపాయల్లో కూడా తగ్గాయి. కరువు సంవత్సరంలో ఇలా జరగడం అంటే గ్రామీణ ప్రాంతాల దుస్థితి మరింత పెరిగింది. 2014 లో వ్యవసాయ సంబంధిత కలహాలు 628గా ఉంటే 2015 లో అవి 327% పెరిగాయని NCRB గణాంకాలు తెలియచేస్తున్నాయి. రైతుల ఆత్మహత్యలు 2014లో 5650గా ఉంటే 2015లో 8000 ను దాటింది. రైతు ఆత్మహత్యలలో 40% పెరుగుదల ఉందని అంచనా.

సాగులో ఉన్న భూవిస్తీర్ణం తగ్గుతున్నది. రైతుకు ఉత్పాదక వ్యయం నికరంగా పెరుగుతూనే ఉంది. పెరుగుతున్న వ్యయానికి తగ్గట్లుగా కనీస మద్దతు ధర (MSP) పెరగడం లేదు. ఎగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైస్ కమిషన్ నిర్ధారించిన ఉత్పాదక వ్యయం కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువగా కనీస మద్దతు ధర ఇస్తామని మోదీ తన ఎన్నికల ప్రచారంలో చెప్పిన సంగతిని మనం గుర్తు తెచ్చుకోవాలి. కనీస మద్దతు ధర లేనందువల్ల ఆహారధాన్యాల ఉత్పత్తి మనం గత సిసి నివేదికలో చెప్పిన దాని కన్నా ఎక్కువగా పడిపోతున్నది.

ఇలాంటి పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో ఉన్న గ్రామీణ ప్రజలకు పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నది. కరువు పీడిత ప్రజలకు సహాయం అందించాలని సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని చెప్పిన తర్వాత కూడా ప్రజలకు అందిన సహాయం అంతంత మాత్రమే. సుప్రీం కోర్టు జోక్యం తరువాత కూడా ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వల్ల MNREGA (ఉపాధి హామీ పథకం) ద్వారా ప్రజలకు న్యాయబద్ధమైన వేతనాలు అందడం లేదు. MNREGA క్రింద 21.80 కోట్ల శ్రామికులు ఉండగా ఇందులో 10.98 కోట్ల శ్రామికులు పనిలో ఉన్నారు. ఆధార్ కార్డులున్న వారికి మాత్రమే బ్యాంకు అకౌంట్ల ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలన్న విధానాన్ని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తుంది. అయితే 8.07 కోట్ల కార్మికులు మాత్రమే ఆధార్ కార్డుతో అనుసంధానించబడిన బ్యాంక్ అకౌంట్లు కల్గి ఉన్నారు. మిగిలిన వారికెవ్వరికి కూడా చట్టబద్ధమైన వేతనాలు చెల్లించబడటం లేదు.

ఆధార్‌లో అనుసంధానించబడిన బ్యాంక్ అకౌంట్లకే నగదు బదిలీ జరగడం అత్యంత లోపభూయిష్టమైన పద్ధతి. చాలా ప్రాంతాలలో ప్రజలకు ప్రాథమికమైన అర్హతలు నిరాకరించ బడుతున్నాయి. దీని వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థ నుంచి తమకు న్యాయ బద్ధంగా లభించాల్సిన సరుకులను ప్రజలు పొందలేక పోతున్నారు. వేలిముద్ర మిషిన్స్ అర్హత ఉన్న ప్రజల వేలి ముద్రలను సరిగ్గా గుర్తించలేక పోతున్నాయి. ఈ సాకుతో పెద్ద సంఖ్యలో ప్రజలకు రేషన్ సరుకులు అందివ్వడం నిరాకరించబడుతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వజనీనం చేయమని మనం డిమాండ్ చేస్తున్నాము. దీనివల్ల అత్యవసర వస్తువుల పంపిణీ మెజారిటీ ప్రజలకు పంపిణీ చెయ్యగలిగే అవకాశముంటుంది. కానీ బిజెపి ప్రభుత్వం ఈ దిశగా పనిచేసేందుకు నిరాకరిస్తున్నది.

## పెరుగుతున్న ధరలు మరియు నిరుద్యోగం

ప్రజలపై దాడి రెండు రకాలుగా జరుగుతున్నది. ఒక వైపు పెరుగుతున్న

నిరుద్యోగం మరోవైపు అత్యవసర వస్తువుల ధరలలో ముఖ్యంగా ఆహార ధరల నిరంతర పెరుగుదల చూస్తున్నాము. అధికారిక లెక్కల ప్రకారం పట్టణ ప్రాంతాలలో ఉపాధి కల్పన 11.24 శాతం ఉండగా గ్రామీణ ప్రాంతాలలో 9.18 శాతంగా ఉంది. ఈ అంకెలు లోపభూయిష్టమైనవని మనందరికి తెలుసు. స్వయం ఉపాధి ప్రమాణాలను నిరుద్యోగాన్ని అల్పఉద్యోగితనం దాచి పెట్టేందుకు ఉపయోగిస్తున్నారు. వాస్తవంగా నిరుద్యోగపు రేటు మరింత ఎక్కువగా ఉంటుంది.

పెరుగుతున్న ధరల ద్వారా ప్రజలపై పడే భారం తీవ్రత కొనసాగుతూనే ఉన్నది. గత ఐదు నెలలుగా టోకు ద్రవ్యోల్బణం పెరుగు తున్నది. ఆగస్టు నెలలో టోకు ధరల సూచిక 3.74%గా ఉందని అధికారికంగా ప్రకటించారు. ఆహార ఉత్పత్తుల ధరలు 8.23%, పప్పుధాన్యాలు 34.55%, బంగాళదుంపలు 66.72% మరియు చెక్కర ధరలు 35.66% పెరిగాయి.

ఈ వాస్తవాలను మరుగుపరిచేందుకు ప్రభుత్వం నిస్సిగ్గుగా దిగ్ర్భాంతి కరమైన అభివృద్ధి సూచికలను చూపుతున్నది. ప్రధానమంత్రి సృష్టి అయిన నీతి ఆయోగ్ పేదరికం గురించి ప్రచారంలో పెట్టిన అంచనాలు కూడా ఈ కోవలోకే వస్తాయి. పేదరికం గురించి సరైన అంచనాలు వేయడం చాలా కష్టమని వారు నిర్ధారించారు. కాబట్టి పేదరికంపై అంచనాలు వేయడానికి మరో కమీషన్‌ను నియమించాలని ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫారసు చేసింది. ఇంతకు ముందు టెండుల్కర్ కమిటీ పేదరికానికి చాలా అవిశ్వాసనీయమైన నిర్వచనాన్ని ఇచ్చి దాని ఆధారంగా భారతదేశంలో 27 కోట్ల పేదలు ఉన్నారని తేల్చింది. రంగరాజన్ కమిటీ మాత్రం 36.3 కోట్ల పేదలున్నారని చెప్పింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం పేదరికంపై అసలు అంచనాలు వేయడానికి కూడా సిద్ధంగా లేదు. బిజెపి ప్రభుత్వ హయంలో అసలు పేదరికమే నిర్మూలించబడిందని వారు చెప్పుకోవాలనుకుంటున్నారు.

## ప్రణాళికలకు తిలోదకాలు

ప్లానింగ్ కమిషన్‌ను రద్దు చేసిన తర్వాత ఇప్పుడు ప్రభుత్వం ప్రణాళికా ప్రక్రియనే వదిలెయ్యాలని ఆలోచిస్తున్నట్లుగా రిపోర్టులు వస్తున్నాయి. పంచవర్ష ప్రణాళికకు మరియు వార్షిక ప్రణాళికలకు కూడా తిలోదకాలిచ్చేసారు. ప్రణాళిక ప్రక్రియకు స్వస్తి పలకడమంటే సబ్-ప్లాన్ భావనకు ముగింపు పలకడమన్నట్లే. దీని వల్ల ఎస్సీ సబ్‌ప్లాన్ మరియు ఎస్టీ సబ్ ప్లాన్‌లకు తీవ్ర విఘాతం కల్గుతుంది. ఈ సబ్‌ప్లాన్‌లను సరిగా అమలు చెయ్యాలని మరియు కేటాయించిన నిధులను సరైన రీతిలో వినియోగించాలని మనం డిమాండ్

చేస్తున్నాము. ఇప్పుడు ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్‌లకు స్వస్తి పలికే ఆలోచన ఉన్నందువల్ల, సబ్‌ప్లాన్‌ల ద్వారా దళితులకు, గిరిజనులకు లభిస్తున్న కొద్దిపాటి ఉపశమనం కూడా ఆగిపోతుంది. అట్లాగే నత్తనడక నడుస్తున్న అభివృద్ధి పనులు కూడా పూర్తిగా ఆగిపోతాయి.

అభివృద్ధి పనులకై కేటాయించిన వనరులలో 10% ఈశాన్య రాష్ట్రాలకు కేటాయించాలన్న నిబద్ధత నుంచి ప్రభుత్వం తప్పుకోవచ్చు. సంబంధించిన ప్రత్యేక మంత్రిత్వశాఖను, డిపార్ట్‌మెంట్‌ను కూడా ప్రభుత్వం రద్దుచేయవచ్చు. ఇది ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి విఘాతం కల్గిస్తుంది. దీనివల్ల అక్కడ ప్రజల్లో అసంతృప్తి రాజుకొని వారు జాతీయ స్రవంతి నుంచి దూరమైపోయి ఇతర సంబంధిత సమస్యలు పెరిగే అవకాశాలుంటాయి.

ప్రధానమంత్రి తన ప్రభుత్వ విజయాల గురించి కొనసాగిస్తున్న ప్రచారోధృతిలోని బండారాలు బయట పడుతున్నాయి. అయితే ఇవన్నీ ఉత్తివేనని తేలిపోతున్నాయి. జన్‌ధన్ యోజన కింద 24.1 కోట్ల కొత్త బ్యాంకు అకౌంట్లు తెరవ బడ్డాయని ప్రధానమంత్రి చెప్పుకున్నారు. అయితే 2014 నాటికే అందులో 75% అకౌంట్లు జీరో బ్యాలన్స్‌తో ఉన్నాయని తెలుస్తున్నది. ఈ జీరో బ్యాలన్స్ అకౌంట్ల సంఖ్యను తగ్గించడానికి ఈ అకౌంట్లలో కనీసం ఒక్కరూపాయి జమ చేయాలని జాతీయ బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని మీడియా రిపోర్టులు తెలియ చేస్తున్నాయి. దీనివల్ల జీరో బ్యాలన్స్ అకౌంట్ల సంఖ్య 2015 లో 8.40 కోట్ల నుంచి 5.87 కోట్లకు తగ్గిపోయింది.

ప్రజలు గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోవడం వల్ల 22,000 కోట్ల రూపాయలు మిగిలాయని ప్రధానమంత్రి గొప్పలు చెప్పుకుంటున్నారు.అయితే కాగ్ నివేదిక ఈ బండారాన్ని బయటపెట్టింది. LPG సబ్సిడీ ద్వారా వచ్చిన మిగులు 1763 కోట్లు మాత్రమేనని మిగతా 21,552 కోట్ల మిగులు అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గడం వల్ల సాధ్యమైందని కాగ్ తేల్చి చెప్పింది. అలాగే ప్రధానమంత్రి ఎర్రకోట నుంచి ఇచ్చిన తన ఉపన్యాసంలో గ్రామీణ విద్యుదీకరణ గురించి ఉదాహరణలతో వివరించిన విషయాలన్నింటినీ ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ అకౌంట్ నుంచి తీసివేసారు. 98.7% గ్రామాలు విద్యుదీకరింపబడ్డాయని అధికారికంగా ప్రచారం చేసారు. కానీ ప్రభుత్వ డాటా ప్రకారం ఇంకా 35.73% గ్రామీణ కుటుంబాలకు (6.14 కోట్లు) విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేదు.

## ప్రభుత్వోద్యోగులకు నిరాశాజనకమైన వేతన సవరణ

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన వేతన సవరణ నిరాశాజనకంగా ఉంది. ఏడవ వేతన సంఘం సిఫార్సుల మేరకు జరిగిన వేతన సవరణలో చిట్టచివరి క్యాటగిరి ఉద్యోగులకు మొత్తం వేతనంలో 14.2% వృద్ధి ఉండగా చేతికందే జీతంలో కేవలం 7.4% వృద్ధి మాత్రమే ఉంది. అలవెన్స్ పెరుగుదలకు సంబంధించిన నిర్ణయాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రభుత్వంలోని అత్యంత ఉన్నత శ్రేణి ఉద్యోగికి మరియు అత్యంత నిమ్న శ్రేణి ఉద్యోగి వేతనంలో ఉన్న తేడా చాలా ఎక్కువగా అంటే 1:14 నిష్పత్తిలోనే కొనసాగుతున్నది.

## EPF (ఉద్యోగుల భవిష్య నిధి) పై దాడి

కార్మికులకు ఇదివరకు లభించిన సౌకర్యాలను ప్రస్తుత ప్రభుత్వం నిరాకరిస్తున్నది. EPF లాంటి చాలా సౌకర్యాలను తగ్గించారు. ఉద్యోగులు కష్టపడి సంపాదించిన ప్రావిడెంట్ ఫండ్‌లో దాచుకున్న సొమ్ముపై వడ్డీరేట్లను నియంత్రించి 8.6% నికి పరిమితం చేయాలని గత సంవత్సరం ప్రభుత్వం నిశ్చయించింది. క్రితం సంవత్సరం వడ్డీ రేటు 8.8 శాతం ఉండేది.అయితే 8.95% వడ్డీ ఇచ్చినా 100 కోట్ల మిగులు ఉండే అవకాశాలున్నాయి. కార్మికులకు తాము స్వయంగా సంపాదించుకున్న సొమ్ముపై న్యాయబద్ధంగా రావాల్సిన ఆదాయాన్ని కూడా ప్రభుత్వం నిరాకరిస్తున్నది.

## ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం

ప్రధానమంత్రి తన ప్రభుత్వం స్కామ్ రహిత ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవానికి ప్రభుత్వం తనకు కావల్సిన కార్పొరేట్ దిగ్గజాలకు ప్రయోజనం కల్గించే అతి నికృష్టమైన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్నది. భారతీయ కార్పొరేట్ సంస్థలు సుమారు 8.5 లక్షల కోట్ల రూపాయాలు బ్యాంకుల నుంచి అప్పుగా తీసుకున్నాయి. ఈ అప్పులు తిరిగి చెల్లించలేదు. మార్చి 2016 నాటికి అతిపెద్ద పది కార్పొరేట్ కంపెనీలు 57368 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఈ అప్పులను మాఫీ చేయాలని లేదా పునర్వ్యవస్థీకరించాలనుకుంటున్నది. ఇందువలన జాతీయ బ్యాంకులలో మూలధన పెట్టుబడులను పెంచాల్సిన అవసరం వస్తుంది. ఇందుకోసం రిజర్వ్‌బ్యాంక్ రిజర్వ్‌ఫండ్ నుంచి నిధులను స్వీకరించాల్సి ఉంటుంది. రఘురామరాజన్ దీనిని వ్యతిరేకించినందువల్లే ఆయనను పదవిలో కొనసాగించలేదు. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థను అస్థిరపరిచేందుకు దారితీయవచ్చు. రఘురామరాజన్ ఇప్పుడు గవర్నర్‌గా లేరు.

రిజర్వ్‌బ్యాంకులోని రిజర్వ్ ఫండ్ ప్రజల సొమ్ము. ఈ రిజర్వ్‌ఫండ్‌ను కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడడం కోసం జాతీయ బ్యాంకులలో పెంచాల్సిన మూల ధనం పెట్టుబడుల నిల్వలను పెంచేందుకు ఉపయోగిస్తారా అన్నది మనం శ్రద్ధగా గమనించాల్సి ఉంటుంది. ఇది ఆశ్రిత పెట్టుబడి దారీ విధానానికి సిగ్గుమాలిన ఉదాహరణగా చెప్పవచ్చు. 2014-15 మరియు 2015-16లలో పబ్లిక్ రంగ బ్యాంకులు రు.1,12,089 కోట్ల రూపాయల అప్పులను మాఫీ చేసినట్టు ప్రభుత్వం పార్లమెంట్‌లో ఒప్పుకున్నది. కార్పొరేట్లకు పెద్ద మొత్తంలో అప్పులను మాఫీ చేస్తున్న ప్రభుత్వం మరోవైపు పేద రైతులు కేవలం కొన్ని వేల రూపాయల అప్పులను చెల్లించకపోతే వారిపై అభియోగాలు మోపి వారి ఆస్తులను, పశువులను జప్తు చేస్తున్నది. ఈ అప్పుల భారమే రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. వ్యవసాయ సంక్షోభ బాధితులకు రుణమాఫీ ద్వారా ఉపశమనం కల్గించడానికి నిరాకరిస్తున్న ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం పెద్ద ఎత్తున రుణాలను మాఫీ చేస్తున్నది. కార్పొరేట్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను బలవంతంగానైనా వసూలు చేయాలి. తర్వాత బ్యాంకుల మూలధన పెట్టుబడులను పెంచే ప్రయత్నం చేయాలి. కానీ ప్రభుత్వం ఈ తర్కాన్ని ఆమోదించడానికి సిద్ధంగా లేదు. మన పోరాటం మొదట కార్పొరేట్ల నుంచి బకాయిల వసూలు, ఆ తర్వాత మూలధన పెట్టుబడి పెంపుదల గురించి జరగాలి.

2015 -16 లో కోల్పోయిన పన్ను రాబడి 6,11,128 కోట్లకు పెరిగిందని ప్రభుత్వమే స్వయంగా తెలియచేసింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల అమలు తీరును ఇది తెలియచేస్తున్నది. పార్లమెంట్ ఆమోదం పొందిన పేదలకు ఉపశమనం కల్గించే పథకాల అమలుకు వనరులు లేవని చెప్తున్న ప్రభుత్వం కార్పోరేట్లకు, ధనవంతులకు పన్ను మినహాయింపులు ఇవ్వడం బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ఎంత బలంగా అమలు చేస్తున్నదో తెలియచేస్తుంది.

## పతనమవుతున్న ప్రజారోగ్య వ్యవస్థ

ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ పెట్టుబడుల క్షీణత వల్ల ప్రజారోగ్య రంగంలో సంక్షోభం తీవ్రమై ఆత్యయిక పరిస్థితులను తలపిస్తున్నది. ప్రభుత్వ సంస్థలు, ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తగినంతగా లేనందువల్ల అలాగే ప్రైవేటు వ్యాపారము వేగవంతంగా విస్తరిస్తున్నది. అందువల్ల పేదలు మరియు బలహీన వర్గాలు దయనీయమైన పరిస్థితులలో ఉన్నారు. మందుల ఉత్పత్తి మరియు పంపిణీ వ్యవస్థ నుంచి ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో మందుల ధరలు ఆకాశాన్నంటాయి. తలసేమియా

వ్యాధితో బాధపడుతున్న వేలాదిమంది రోగులు డెస్‌ఫెరాల్ మందు దొరకక అవస్థలు పడుతున్నారు. ఈ ఔషధాన్ని నొవార్టిస్ అనే కంపెనీ మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. ఈ కంపెనీయే కృత్రిమ కొరతను సృష్టించింది కూడా.

దేశంలోనున్న సాధారణ ఆహార భద్రత చాలా కనిష్టస్థాయి పోషకాహార లోపానికి దారితీస్తున్నది. ఈ పోషకాహార లోపం ముఖ్యంగా చిన్న పిల్లలలో అలాగే గర్భిణీస్త్రీలలో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నది. బరువు తక్కువగా ఉండటం, గిడచబారి పోవడమనేది ప్రపంచంలోనే మనదేశం పిల్లలలో ఆందోళన కలిగించే స్థాయిలో ఉంది. ఆరోగ్య రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు జిడిపిలో ఒక శాతం మాత్రమే. దీనివల్ల డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి వైరల్ వ్యాధుల వ్యాప్తిని అడ్డుకోలేకపోతున్నాము. మెట్రో పాలిటన్ నగరాలైన ఢిల్లీ మరియు కోల్‌కత్తాలో ఇవి అంటు వ్యాధుల స్థాయికి చేరుతున్నాయి.

## మహిళలు, పిల్లలపై పెరుగుతున్న దాడులు

మహిళలపై దాడులకు సంబంధించి ఎన్నికలకు ముందు బిజెపి మరియు మోడీ అప్పటి యుపిఏ ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినప్పటికీ ఈ ప్రభుత్వ హయాంలో కూడా మహిళలపై దాడులు కొనసాగుతున్నాయి. నిజానికి దాడులు మరింత పెరిగాయని రుజువవుతున్నాయి. కలవరపరిచే అంశం ఏమిటంటే ఆడపిల్లలపై అత్యాచారాలు, మానభంగాలు పెరిగాయి. శిశువులను కూడా వదలడం లేదు. దళితులు, మైనారిటీలపై దాడులు చేయడానికి ఈ వర్గాలకు చెందిన మహిళలపై, లైంగిక అత్యాచారాలు, దాడులను ఒక ఆయుధంగా సాగిస్తున్నారు. మహిళా సాధికారిత గురించి మాట్లాడుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లు గత రెండు దశాబ్దాలుగా ఇనపపెట్టెలోనే మూలుగుతున్నది. మహిళా ఉద్యమంతో పాటు ప్రజాస్వామ్య శక్తులన్నీ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి ఒత్తిడి తేవాలి.

## సెప్టెంబర్ 2 సమ్మె

కార్మికుల దిగజారుతున్న జీవన ప్రమాణాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకై, అలాగే నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సెప్టెంబర్ 2 సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కన్నా కర్కశంగా అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాల సమ్మె పిలుపుకు మంచి స్పందన వచ్చింది. గత సంవత్సరపు సమ్మె కంటే ఈ సమ్మె ఎక్కువ ప్రభావాన్ని చూపించింది.

## మతతత్వ సమీకరణలు

### గోరక్షక కమిటీలపై నిషేధం

బిజెపి ప్రభుత్వ ప్రాపకంతో హిందుత్వ శక్తులు అన్ని వైపుల నుంచి చేస్తున్న దాడుల గురించి గత కేంద్ర కమిటీ సమావేశంలో మనం చర్చించుకున్నాము. 2014లో ప్రభుత్వం ఏర్పరచినప్పటి నుంచి ఏదో ఒక విషయం మీద హిందుత్వ శక్తులు మతపరమైన సమీకరణలు చేస్తున్నాయి. లవ్ జీహాద్, ఘర్‌వాపసీ, బలవంతపు మత మార్పిడిలు, హిందుత్వ జాతీయవాదం, రెచ్చగొట్టు ఉపన్యాసాలు, ఇప్పుడు తాజాగా 'గోరక్షణ' లాంటి మతపరమైన ప్రచారాలు చేస్తున్నారు. గోవులను సంరక్షించే పేరు మీద గోరక్షక కమిటీలను చాలా రాష్ట్రాలలో క్రియాశీలకంగా తయారు చేస్తున్నారు. ఈ గోరక్షక కమిటీ సభ్యులు గోవులను రక్షించే పేరుమీద గోహత్య మరియు గోమాంసం తింటున్నారన్న తప్పుడు ఆరోపణలతో దళితులపై, మైనారిటీలపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారు. చాలా బిజెపి ప్రభుత్వాలు మరికొన్ని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు గోరక్షణ చట్టాలు చేసాయి. ఈ గోరక్షక కమిటీలు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుంటున్నాయి. మైనారిటీలు, దళితులను భయభ్రాంతులను చేసి వారిపై దాడులకు తెగబడుతున్నారు. దాద్రిలో మహమ్మద్ అఖ్లక్ చిత్రవధ తర్వాత జార్ఖండ్‌లోని లాటేహర్‌లో ఇద్దరు ముస్లిం పశువుల వ్యాపారులను బహిరంగంగా ఉరితీశారు. గుజరాత్‌లోని ఉనాలో నలుగురు దళితులను కొట్టడం దళితులను భయపెట్టే ఉద్దేశంతో చేసింది. బక్రీద్‌కు ముందు హర్యానాలోని ముస్లిం మెజారిటీ జిల్లా మేవాట్‌లో ఈ మధ్యనే కొన్ని సంఘటనలు జరిగాయి. ఇద్దరు యువతులను గ్యాంగ్‌రేప్ చేసారు. గోమాంసం ఉన్నదన్న ఆరోపణపై కొందరిని చంపేశారు. మేవాట్ బిర్యానీకి ప్రసిద్ధి. బిర్యానీలో బీఫ్ ఉందో లేదోనని మేవాట్ పరిసర ప్రాంతాలలో తరచుగా పరీక్షించడం వల్ల ఈద్ ముందు చాలా బాగా జరిగే బిర్యానీ వ్యాపారానికి ఇబ్బందులు ఎదురై వ్యాపారస్తులు భయభ్రాంతులయ్యారు.

దిగ్భ్రాంతి కల్గించే విషయమేమంటే ఈసంఘటనలన్నింటిలో పోలీస్ మరియు ప్రభుత్వం మౌన ప్రేక్షకులుగా ఉన్నారు. అంతేకాక ప్రభుత్వమే కొన్ని సార్లు నిందితులకు సహాయం చేయడం, అలాగే బాధితులపై కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నది. ఈ గోరక్షణ చట్టాలు మరియు గోసంరక్షణ వ్యవసాయానికి భారీ నష్టం కల్గించి రైతుల జీవితాలను నాశనం చేస్తున్నది. చాలా ప్రాంతాల్లో ఆవులు ఉత్పాదక వయస్సు దాటిన తర్వాత వాటిని సంరక్షించే ఏర్పాట్లు ఏమీ లేవు. తరుచూ ఆవుల మందలు వ్యవసాయ క్షేత్రాలలోకి చొరబడి పంటలను నాశనం చేస్తుంటాయి. రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇచ్చేది లేదు. రాజస్థాన్

(గో సంరక్షణకే ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉన్న బిజెపి పాలిత రాష్ట్రం) లాంటి రాష్ట్రాలలో గోశాలలు ఉన్నప్పటికీ సరైన సంరక్షణ లేక వందలాది ఆవులు చనిపోయాయి.

గోరక్షణ కమిటీలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి అనుమతి ఇవ్వడానికి వీల్లేదు. చట్టాలను అమలు చేయాల్సింది రాష్ట్ర ఏజన్సీలు మరియు పోలీసులు. చట్టాలను అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు ఆవారా గ్యాంగులు ఉన్మాదంతో వ్యవహరించడానికి వీల్లేదు. గోరక్షక కమిటీలపై సత్వరమే నిషేధం విధించాలి.

బీహార్‌లోని చాప్రాతో పాటు చాలా ప్రాంతాలలో మత ఘర్షణలు రాజుకుంటున్నాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎన్నికలకు ముందు మతపరమైన సమీకరణలు చేయడానికి హిందుత్వ శక్తులు తయారవుతున్నాయన్నది స్పష్టం అవుతున్నది.

## దళితులపై పెరుగుతున్న దాడులు

దళితులపై ఎన్నో రకాలుగా దాడులను ప్రోత్సహిస్తున్న పద్ధతికి, దాడులు చేసిన వారిని కాపాడుతున్నందుకు బిజెపి ప్రభుత్వంపై దేశవ్యాప్తంగా దళితులు కోపంతో ఉన్నారు. ముంబాయిలో అంబేద్కర్ భవనం కూల్చివేతపై పెద్ద సంఖ్యలో ప్రజలు పోగయ్యారు. ఉనా సంఘటన తర్వాత దళితులు పెద్ద ఎత్తున సమీకరింపబడ్డారు. దీనిని అడ్డుకోవాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నించి విఫలమయింది. దళిత, వ్యవసాయ కార్మిక, మహిళా సంఘాల ద్వారా మన కామ్రేడ్స్ ఈ ప్రదర్శనలలోనూ నిరశన కార్యక్రమాలలోనూ పాల్గొన్నారు. పార్టీ, రకరకాల దళిత గ్రూప్‌ల మధ్య సమన్వయం కొనసాగుతుంది. 'దళిత స్వాభిమాన్ సంఘర్ష్' ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16న జరిగిన కార్యాచరణలో పార్టీ క్రియాశీలకంగా పాల్గొంది. ఈ సమన్వయం మరింత పెరగాలి. సామాజిక అణచివేత మరియు ఆర్థిక దోపిడీలకు సంబంధించిన సమస్యలపై సమన్వయంతో పనిచేయాలన్న మన పార్టీ మహాసభ నిర్ణయం ఇలాంటి కార్యక్రమాలతో బలోపేతం చేయాలి.

## మైనారిటీలపై పెరుగుతున్న దాడులు

ఈ కాలంలో మైనారిటీల మీద ముఖ్యంగా ముస్లింల పైన దాడులు పెరిగాయి. నరేంద్ర మోడి ఎన్నికల వాగ్దానమైన **'సబ్ కా సాథ్, సభ్ కా వికాస్ '** నిజమైనదని లక్షలాది మంది ప్రజలు విశ్వసించారు. ఆర్ఎస్ఎస్, బిజెపిల మతతత్వ ప్రచారంతో ఆయనకున్న అనుబంధం దేశ అభివృద్ధికి అడ్డంకి కాబోదని అనుకున్నారు. కానీ పరిస్థితులు విషమించాయి. ఎన్నికలకు ముందు బిజెపి చేసిన మత సమీకరణలు, ముజఫర్‌నగర్ అల్లర్ల తర్వాత కూడా ప్రజలు మోడిపై ఆశలను ఉంచుకున్నారు.

కానీ వాస్తవంగా గత రెండేళ్ళలో మత సంఘర్షణల సంఖ్య పెరిగింది.

మతపరమైన ఘర్షణల వల్ల సంభవించే దుర్ఘటనలు గత సంవత్సరంలో పెరిగాయని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు తెలియచేస్తున్నాయి. 2014 లో మత సంఘర్షణల వల్ల 95 మంది చనిపోగా 1921 మంది గాయాలపాలయ్యారు. 2015 లో ఇది పెరిగి 97 మంది చనిపోగా, 2246 మంది గాయాలపాలయ్యారు. 2014లో 644 మత ఘర్షణలు జరగగా 2015 లో 751 కు పెరిగింది. ఇలా మత ఘర్షణలలో పెరుగుదల 17% ఉంది. ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు ప్రేరేపిత మతోన్మాద సంఘటనలు పెరగడంతో పాటు ఈ రోజు మతోన్మాద వైరస్ రాజకీయ వ్యవస్థలో పరిపాలన వ్యవస్థలో చొచ్చుకుపోయింది. మైనార్టీలకు అందిస్తున్న న్యాయం, ధర్మం కూడా పక్షపాతంగా తయారవడం స్పష్టంగా కనిపిస్తున్నది.

## కాశ్మీర్

బుర్హాన్ వాని హత్య తర్వాత గత తొమ్మిది వారాలుగా కాశ్మీర్ ప్రజలు గుంపులుగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. 70 మందికి పైగా భద్రతా దళాల చేతుల్లో చనిపోయారు. వేలాదిమంది గాయపడ్డారు. భద్రతా దళాలు ఉపయోగించిన పెల్లెట్ గన్స్ వల్ల చాలా మంది వికలాంగులుగా మారారు. ఈ ఆందోళనలు పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామాలకు కూడా వ్యాపించాయి. భారతదేశానికి కాశ్మీరీ ప్రజలకు మధ్య ఇంత పెద్ద అగాధం ఎప్పుడూ ఏర్పడలేదు. గొడవలు ప్రారంభం కాగానే, అఖిల పక్షం కాశ్మీర్‌కు వెళ్లి అన్ని వర్గాల ప్రజలతో షరతులు లేని రాజకీయ చర్చలు వెంటనే ప్రారంభించాలని మన పార్టీ డిమాండ్ చేసింది. రెండు నెలల కర్ఫ్యూ మరియు పార్లమెంట్ మూడు సార్లు చర్చించిన పిదప అఖిల పక్షాన్ని పంపడానికి ప్రభుత్వం అయిష్టంగానే పంపించవలసి వచ్చింది.

ఆర్టికల్ 370 క్రింద జమ్మూ, కాశ్మీర్‌కున్న ప్రత్యేక స్థానాన్ని స్వయం ప్రతిపత్తిని కొనసాగించాలని పార్టీ ఎల్లప్పుడు వాదిస్తూనే ఉంది. ముందుగా అఖిల పక్షం కాశ్మీర్‌కు వెళ్లి ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే ఐదు ప్రక్రియలను చేపట్టాలని సిపిఐ(ఎం) మరియు సిపిఐలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి. పెల్లెట్ గన్‌ల ఉపయోగాన్ని ఆపివేయడం, ఏఎస్‌పిఎస్ఎ సైన్యాన్ని పౌరులు నివసించే ప్రాంతాల నుంచి ఉపసంహరించుకోవడం, సైన్యం చేసిన మితిమీరిన ఆగడాలపై న్యాయవిచారణ జరపడం, చనిపోయిన వారి కుటుంబాలకు తగిన నష్టపరిహారాన్ని అందివ్వడం, గాయాలపాలైన వారికి పునరావాసం కల్పించడం, నిర్ధిష్ట కాల పరిధిలో ఆర్థికాభివృద్ధిని అందించడం, ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టడం, దుల్హస్తి మరియు ఉని విద్యుత్ ప్రాజెక్ట్‌ల బదిలీ అలాగే శ్రీనగర్‌లో ఐఎంఎం

మరియు ఐఐటిలను ప్రారంభించడం ఈ విశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో భాగంగా ఉండాలని మనం చెప్పాము.

కాశ్మీర్‌లోని అన్ని వర్గాల ప్రజలతో చర్చలు చేపట్టాలని వామపక్షాలు సూచించాయి. ఆర్టికల్ 370 అమలులో ఉన్న లోపాలను సవరిస్తామన్న ప్రాతిపదికపై చర్చలు జరపాలని వామపక్షాలు సూచించాయి. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లు, జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో భాగంగా ఉంటూనే స్వయం పరిపాలనా వ్యవస్థలుగా ఉండాలి. దీనికి గాను రాజ్యాంగ మరియు న్యాయ సూత్రాల్లో మార్పులు తేవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న చట్టాలను సవరించి ఈ మార్పులు తీసుకురావాలి. దీంతో పాటు పాకిస్తాన్‌తో కాశ్మీర్ సహా అన్ని ఇతర మిగిలిన విషయాలపై చర్చలు జరపాలి. 2014 నుండి పాకిస్తాన్‌తో సమగ్రమైన చర్చలు చేపట్టడంలో అసలు ఉద్దేశం ఏమిటో తెలియని వూగిసలాట ధోరణి అనుసరిస్తున్నాము. భారతదేశ ప్రయోజనాలను పరిరక్షించే చట్రంలో చర్చలు చేపట్టడం ద్వారా శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించాలి.

అఖిల పక్షం కాశ్మీర్ ప్రాంతాన్ని సెప్టెంబర్ 4,5 తేదీలలో సందర్శించింది. దీనిపై ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఖచ్చితమైన ఎజెండా కానీ, ప్రతిపాదనలు కానీ లేవు. అఖిల పక్షం ఎవరిని కలవాలో, ఏ పార్టీలు లేదా పౌర సమాజపు సంస్థలను కలవాలో ప్రభుత్వం  నిర్ధిష్టంగా చెప్పలేదు. సిపిఐ(ఎం), సిపిఐలు మాత్రం అఖిల పక్షం హురియత్ సహా అన్ని వర్గాల ప్రజలను కలవాలని నిర్ణయించాయి.

అఖిల పక్షం సభ్యులైన సిపిఐ(ఎం), సిపిఐ, జెడి(యు),  ఆర్‌జెడి బృందం ఐదుగురు హురియత్ నాయకులను కలవడానికి వెళ్లింది. ఐదుగురిలో గిలానీ ఈ బృందాన్ని కలవలేదు. మిగతా నలుగురిని ఈ బృందం కలిసింది. కాశ్మీర్‌లో శాంతి సాధారణ పరిస్థితులను నెలకొల్పడానికి, అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడడానికి భారత పార్లమెంట్‌లో ఒక బలమైన సెక్షన్ సిద్ధంగా ఉందని ఈ బృందం ఆ ప్రాంత ప్రజలకు తెలియజేసింది. భారతదేశంలో కాశ్మీర్ ప్రజల అర్ధవంతమైన శక్తివంతమైన ఏకీకరణను ఈ పార్లమెంటరీ సెక్షన్ కోరుకుంటున్నదని ఒక బలమైన సంకేతాలను ఈ బృందం కాశ్మీర్ ప్రజలకు పంపగలిగింది.

అఖిల పక్షం ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాశ్మీరీ ప్రజలతో వెంటనే రాజకీయ చర్చలు ప్రారంభించాలని ఏకగ్రీవంగా అంగీకరించారు. దీనిని ప్రభుత్వం స్వాగతించినా దాని అమలుకు కావాల్సిన చర్యలను మాత్రం చేపట్టలేదు. దానికి విరుద్ధంగా కేంద్ర భద్రతా దళాల సంఖ్యను  కాశ్మీర్ వ్యాలీలో పెంచింది. మునుపెన్నడూ లేని విధంగా ఈద్ రోజు శ్రీనగర్‌లోని అన్ని మసీదులను మూసివేశారు.

ఈద్‌గాల వద్ద నమ్మకమున్న వారిని సైతం ప్రార్థనలు చేయడానికి అనుమతించలేదు. శ్రీనగర్‌లోని ప్రసిద్ధి చెందిన జామియా మసీదు ప్రకృతి వైపరీత్యం వల్ల 1821లో ఒకసారి మూసివేయబడింది. ఈద్ రోజు ఈ మసీదును మూసివేయడం ఇదే మొదటిసారి. ఆ రోజు జరిగిన ఘర్షణల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, 50 మంది గాయాలపాలయ్యారు.

పాకిస్తాన్ పట్ల కఠినంగా వ్యవహరించడం, కాశ్మీర్‌లో భద్రతా దళాల ద్వారా ప్రజల హక్కులను అణిచివేయడం ద్వారా మతపరమైన సమీకరణ జరిగి రానున్న ఎన్నికల్లో తమకు లబ్ధి కలుగుతుందని కేంద్ర ప్రభుత్వం హిందూత్వ శక్తులు భావిస్తున్నాయి. ఇది చాలా ప్రమాదకరమైన రాజకీయ క్రీడ. భారతదేశ ప్రజలను ఈ ప్రమాదాల పట్ల మనం అప్రమత్తం చేయాలి. ప్రభుత్వం కాశ్మీర్ సంబంధీకులందరితో రాజకీయ చర్చలను చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలి.

### సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామి

మనం గత సమావేశంలో గుర్తించినట్లు అమెరికా సామ్రాజ్యవాదానికి భారత దేశం వ్యూహాత్మక భాగస్వామిని చేసిన మోడీ ప్రభుత్వం ఆ బంధాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా మరింతగా ముందుకు సాగుతున్నది.

### సైనిక బలగాల సహకార ఒప్పందం(ఎల్ఇఎంఓఎ)

అమెరికాతో సైనిక బలగాల సహకార ఒప్పందం (లాజిస్టిక్ సపోర్ట్ ఎగ్రిమెంట్) పై సంతకాల దిశగా మోడీ ప్రభుత్వం సాగుతున్నదని గత సమావేశాలలో మనం గుర్తించాము. ఈ ఒప్పందం ఉమ్మడి శిక్షణా సమయంలో ఇరు బలగాలూ ఇంధనం, స్పేర్ పార్టులు, మెకానిక్స్ మొదలైన అంశాలలో సహకారం అందించుకునేందుకు అనుమతిస్తుంది. లాజిస్టిక్ ఎక్ఛేంజ్ మెమొరాండం ఆఫ్ ఎగ్రిమెంట్ పేరుతో కుదిరిన సైనిక బలగాల పరస్పర సహకార ఒప్పందంపై రక్షణ మంత్రి పారికర్ అమెరికా పర్యటన సమయంలో లాంఛనపూర్వక సంతకాలు చేశారు.

అలాంటి ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా భారత దేశం అమెరికాకు లాంఛనపూర్వకమైన సైనిక మిత్రునిగా తయారయింది. ఈ ఒప్పందం మేరకు అమెరికా నౌకా, వాయు సైనిక విభాగాలు భారతదేశపు నౌకా, వాయు స్థావరాల నుండి లాజిస్టిక్ సపోర్ట్‌ను అందుకుంటాయి. ఇంధనం నింపుకోవడం, ఇతర సర్వీసులను క్రమబద్ధమైన రీతిలో పొందుతాయి. మరో దేశంపై సైనిక చర్యలకు పాల్పడేందుకు అమెరికా బలగాలు, భారత దేశపు సైనిక స్థావరాలను వినియోగించుకోవచ్చు.

ఈ విధంగా మోడీ ప్రభుత్వం భారత సార్వభౌమత్వం విషయంలో వ్యూహాత్మక స్వతంత్రతను వదులుకొని అమెరికాతో రాజీ పడింది.

భారతదేశం పొందిన ఈ నూతన హెూదా ప్రకారం, భారత సైనిక నౌకలు దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో అమెరికా వ్యూహాత్మక లక్ష్యాలలో భాగంగా గస్తీ తిరిగాయి.

## విదేశాంగ విధానంలో మార్పులు

అమెరికాకు జూనియర్ భాగస్వామి హెూదాను భారతదేశానికి మోడీ ప్రభుత్వం నూతనంగా సంపాదించినందువల్ల ఈ దేశంపై ఎలాంటి వత్తిళ్లు వస్తాయో, భారత విదేశాంగ విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులు స్పష్టం చేస్తున్నాయి. వెనిజులాలో జరుగుతున్న అలీన దేశాల శిఖరాగ్రసభలో పాల్గొనని మోడీ, అలా అలీన శిఖరాగ్ర సభలో పాల్గొనని మొట్టమొదటి భారత ప్రధాని అవుతారు. అందరు భారత ప్రధానులు నెహ్రూ నుండి ఆ తర్వాత అందరు ప్రధానులు (ఒక్క ఆపద్ధర్మ ప్రధాని చరణ్ సింగ్ మినహా) అలీన దేశాల శిఖరాగ్ర సభలన్నింటిలో పాల్గొన్నారు. బిజెపి ప్రభుత్వం అమెరికాతో ప్రత్యేక హోదా పొందినందువలన భారత దేశం ఇన్నాళ్ళుగా అనుసరిస్తూ వస్తున్న విదేశాంగ విధానంలో కీలకమైన అలీన విధానాన్ని విడిచిపెట్టి అమెరికా వైపు మొగ్గింది.

## వరదలు

వరదల మూలంగా బీహారు, ఇంకా పలు రాష్ట్రాలలో పెద్ద ఎత్తున వినాశనం, భారీగా ప్రాణనష్టం సంభవించింది. ఒక్క బీహారులోనే 135 మంది ప్రాణాలు కోల్పోయారు. 12 జిల్లాలలో 35 లక్షల మంది వరద బీభత్సానికి నష్టపోయారు.

ఈ ప్రకృతి వైపరీత్యానికి గురయిన వారికి సహాయక చర్యల విషయంలోను, నష్టపరిహారం అందించడం లోను, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మేరకు కృషి చేయలేకపోయాయి. పదే, పదే సంభవిస్తున్న ఈ వరదల నివారణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టవలసి ఉంది.

## సింగూరు తీర్పుపై

టాటా కార్ల ప్రాజెక్టు కోసం సేకరించిన 997 ఎకరాల భూసేకరణను సుప్రీం కోర్టు కొట్టివేసింది.

అప్పటి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పరిశ్రమలను అభివృద్ధి చేయవచ్చునని, ఉపాధి అవకాశాలను పెంచవచ్చునని భావించింది.

అయితే భూసేకరణకు అప్పటికి అందుబాటులో ఉన్న ఏకైక చట్టం 1894 భూసేకరణ చట్టం ప్రకారం ఈ ప్రక్రియకు పూనుకున్నది. ఈ చట్టం రైతుల ప్రయోజనాలను

పూర్తిస్థాయిలో పరిరక్షించడం లేదు. 2011 అసెంబ్లీ ఎన్నికల సమీక్షా నివేదికలో సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ ఇంతకు ముందే, భూసేకరణ ప్రక్రియలో జరిగిన, "పాలనా పరమైన, రాజకీయపరమైన పొరపాట్లకు భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది." అని పేర్కొంది.

టాటా ప్రాజెక్టును వదిలిపెట్టిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం పరిహారం తీసుకునేందుకు నిరాకరించిన వారికి భూములను అప్పగించేందుకు బిల్లును తెచ్చింది. అప్పుడు సిపిఐ(ఎం) గతంలోని రైతులందరికి భూమిని తిరిగి అప్పగించాలని చెప్పింది. పరిహారం తీసుకోనివారు, తీసుకున్న వారు అన్న విచక్షణ పాటించవద్దని కోరింది. ఇప్పుడు సుప్రీం కోర్టు, గత భూయజమానులందరికీ పరిహారంతో పాటు, భూములను తిరిగి అప్పగించాలని ఆదేశించింది.

కాలం చెల్లిన 1894 భూసేకరణ చట్టం స్థానంలో రైతులకు తగువిధంగా పరిహారం చెల్లించే నూతన చట్టాన్ని తీసుకు రావాలని అనేక దశాబ్దాలుగా సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది. భూసేకరణలో న్యాయబద్ధమైన పరిహారం, పారదర్శకత, పునరావాసం, పునర్నిర్మాణాలకు హక్కు కల్పించే 2013 భూసేకరణ చట్టాన్ని పార్లమెంటు అంతిమంగా ఆమోదించింది. రైతుల ప్రయోజనాలకోసం ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేయడంలో సిపిఐ(ఎం) తన కృషిని కొనసాగిస్తున్నది. కానీ ప్రస్తుత కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆర్డినెన్స్‌ల దార్వా ఈ చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఇలాంటి అన్ని ప్రయత్నాలను సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తుంది. అలాగే అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఇలాంటి ప్రయత్నాలన్నింటినీ కూడా వ్యతిరేకిస్తుంది.

## కోక్రజర్ టెర్రరిస్టు దాడి

బోడోలాండ్ ప్రాంతీయ ప్రాదేశిక జిల్లా ముఖ్యపట్టణమైన కోక్రజర్ సమీపంలోని బాలాజన్ టినియారి బజార్‌లోని ప్రతి వారం జరిగే సంతలో గుర్తుతెలియని ఓ వ్యక్తి తుపాకితో కాల్పులు జరిపినప్పుడు 14 మంది చనిపోయారు, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతం చాలా కాలంగా టెర్రరిస్టు పీడిత ప్రాంతమని, పోలీసు పాలన సాగుతున్న ప్రాంతమని పేరుపడ్డప్పటికీ, కొత్తగా వచ్చిన బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్‌తో కలిసి బిజెపి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అందుచేతనే ఇలాంటి టెర్రరిస్టు చర్యలను అనుమతించడంలో తాను కూడ ముద్దాయి అవుతున్నది. ఈ ఘటనను ఒక హెచ్చరికగా తీసుకొని ప్రజల క్షేమం, భద్రతలను పరిరక్షించాలి.

## కావేరి జల వివాదం

కావేరి జలాల పంపిణీపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అనంతరం కర్నాటకలోను, తమిళనాడు కొన్ని ప్రాంతాలలోను హింసాకాండ, దహనకాండ చోటుచేసుకున్నాయి.

కావేరి జలపంపిణీపై కావేరి వాటర్ ట్రిబ్యునల్ తీర్పును అమలు చేయాలని తమిళనాడు ప్రభుత్వం కేసు వేసిన తర్వాత, రోజుకు 15,000 క్యూసెక్కుల నీరు 10 రోజులపాటు విడుదల చేయాలని సుప్రీంకోర్టు కర్నాటకను ఆదేశించింది. కొన్ని మినహాయింపులున్నప్పటికీ, కర్నాటక ప్రభుత్వం నీరు విడుదల చేసింది. అయితే ఈ తీర్పుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు అప్పీలుకు వెళ్లింది. సుప్రీం కోర్టు తన తీర్పును సవరించి రోజుకు 12,000 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేయాలని, అయితే 15 రోజుల పాటు విడుదల చేయాలని చెప్పింది. ఈ విధంగా కర్నాటక అధిక నీరు విడుదల చేయాల్సి వచ్చింది. ఇందుమూలంగానే కర్నాటకలో సెంటిమెంటు దెబ్బతిని ఆగ్రహావేశాలు పెల్లుబికాయని చెప్పబడుతున్నది.

కర్నాటక, తమిళనాడుల మధ్య కావేరి జల పంపిణీ వివాదం దీర్ఘకాలంగా కొనసాగుతున్నది. వర్షపాతం తక్కువగా ఉన్నప్పుడు, విపత్కర పరిస్థితుల్లో జలపంపిణీని పరస్పర సంప్రదింపుల ద్వారా నిర్ణయించుకోవాలి. నీటిని ఏవిధంగా పంచుకోవాలన్న ఇలాంటి వివాదాలు ఇరు రాష్ట్రాల ప్రజలలోను భావోద్వేగాలను రెచ్చగొట్టి, పరస్పరం ఒకరినొకరు ద్వేషించుకునేలా చేయడం వల్ల పరిష్కారం కావు.

## నూతన విద్యావిధానంపై

నూతన విద్యావిధానంపై పార్లమెంటులో చర్చ జరపాలని మనం వత్తిడి చేశాము. మానవ వనరుల శాఖామంత్రి ఇది కేవలం చర్చకోసం విడుదల చేసిన ముసాయిదా మాత్రమేనని, సంప్రదింపుల ప్రక్రియ, పార్లమెంటులో చర్చ జరిగిన తర్వాత మాత్రమే విధానం రూపొందించబడుతుందని హామీ ఇచ్చారు. ఈ హామీ ఎంతవరకు నిలబెట్టుకుంటారో చూడాల్సి ఉంది.

అయితే ఈ ముసాయిదా, భారత దేశ విద్యారంగం కేంద్రీకరించడానికి, మతతత్వపూరితం చేయడానికి, వాణిజ్యీకరించడానికి రూపొందించ బడింది. దీని ప్రభావాలు తీవ్రంగా ఉంటాయి. ఉపాధ్యాయ, విద్యార్థి, సైన్స్, ఐటి, ఫ్రీ సాఫ్ట్‌వేర్ లాంటి మన వివిధ రంగాలు వాటి గురించి అధ్యయనం చేస్తున్నారు. ఎవరికి వారుగాను అందరూ కలిసి ప్రతిస్పందనను రూపొందిస్తారు.

ముసాయిదా దిశను పరిశీలించినట్లయితే, ఇది భారత విద్యావ్యవస్థను మతత్వ పూరితం చేయడానికి పూనుకున్నదని స్పష్టంగా అర్థమవుతుంది. ఇప్పటికే బిజెపి పాలిత

రాష్ట్రాలలో సిలబస్ పూర్తిగా మార్చబడింది. ఉన్నత విద్యను హిందూత్వ సిద్ధాంతం, ఎజెండాలను ఇముడ్చుకునేలా మార్చివేసేందుకు ప్రయత్నం జరగుతున్నది. భారత దేశ చరిత్ర అంటే  హిందూ పురాణాల అధ్యయనంగాను, సుసంపన్నమైన భారత తాత్విక సంప్రదాయాలను, వైదిక శాస్త్ర అధ్యయనంగాను భారత విద్యావ్యవస్థను దిగజార్చే ప్రయత్నం మొత్తంగా  జరుగుతున్నది.

లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్ స్వభావాన్ని, మన విలువల పునాదులను, సమీకృత సంస్కృతిని, వివిధ మతాలు, భాషలు, అలవాట్లు, ఆచారాలు, సంప్రదాయాల సహజీవనాన్ని మార్చివేసేందుకు తీవ్రమైన ప్రయత్నం జరుగుతున్నది.

విద్యావిధానంపై మానవ వనరుల మంత్రిత్వ శాఖ తనవెబ్‌సైట్ ద్వారా నిర్వహించే చర్చలో మన శాఖలు పాల్గొనాలి. తుది ముసాయిదా పార్లమెంటు శీతాకాల సమావేశాలకల్లా ఆమోదం కోసం వస్తుందని భావిస్తున్నారు. అందుచేత మన సంఘాలు ఇతరులతో సమన్వయం చేసుకోవాలనే లక్ష్యంతో స్వతంత్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ పార్లమెంటు శీతాకాల సమావేశాలనాటికి పార్లమెంటు వద్ద పెద్ద ఎత్తున జోక్యం చేసుకోవాలి.

## అగర్తలలో హింసాకాండ

త్రిపురలో గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఐపిఎఫ్‌టి వేర్పాటువాద ప్రచారాన్ని కొనసాగిస్తున్నది. అగస్టు 23న అగర్తలలో వారు ర్యాలీ నిర్వహించి హింసాకాండకు పాల్పడ్డారు. నగరం ఒక ప్రాంతంలో ప్రారంభమయిన ఈ హింసాకాండ ఇతర ప్రాంతాలకు కూడ వ్యాపించింది. 20 మంది గాయాలై, ఆసుపత్రి పాలు కావలసి వచ్చింది. బిజెపి, తృణమూల్‌లు కూడ దీనిని ఆసరాగా తీసుకొని, దమనకాండకు పాల్పడుతున్న వారితో చేతులు కలిపాయి. అయితే ఇంతకు ముందరి టియుజెఎస్‌కి చెందిన మూడు గిరిజన గ్రూపులు, ఐఎన్‌పిటిలు రాష్ట్రంలో శాంతి, సామరస్యాలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశాయి.

ఈ దాడులకు నిరసనగా, శాంతియుత పరిస్థితులు నెలకొల్పడం కోసం ప్రజలను సమీకరించేందుకు పార్టీ, లెఫ్ట్ ఫ్రంట్‌లు జోక్యం చేసుకున్నాయి. అగస్టు 28న లెఫ్ట్ ఫ్రంట్ శాంతి ర్యాలీని నిర్వహించి, శాంతి, సామరస్యాలను కాపాడమని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. గిరిజన–గిరిజనేతర ఐక్యతను కొనసాగించడంలో త్రిపుర ప్రజలు ఎంతో ఉన్నతమైన అనుభవాన్ని కలిగి ఉన్నారు. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని అస్థిరత్వం పాల్జేయాలని ఈ హానికరమైన శక్తులు చేస్తున్న ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండి శాంతి సామరస్యాలను కాపాడమని సిపిఐ(ఎం) ప్రజాస్వామిక శక్తులకు విజ్ఞప్తి చేస్తున్నది.

## ఎడిసి ఉప ఎన్నిక విజయం

సిమ్నా, టామ్‌కర్ (ఎస్‌టి) నియోజకవర్గం ఉపఎన్నికలో లెఫ్ట్ ఫ్రంట్ నిలబెట్టిన సిపిఐ(ఎం) అభ్యర్థి విజయం సాధించారు. తన సమీప ఐపిఎఫ్‌టి అభ్యర్థిపై ఆయన గెలుపొందారు. మన అభ్యర్థికి గత సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఓటింగ్ శాతం కన్నా 5.6 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. ఐపిఎఫ్‌టి అభ్యర్థికి కూడ 5.3 శాతం ఓట్లు పెరిగాయి. ఐపిఎఫ్‌టి అభ్యర్థికి అన్ని ప్రతిపక్షాల ప్రత్యక్ష, ప్రచ్ఛన్న మద్దతు లభించింది. తృణమూల్ కాంగ్రెస్ తన అభ్యర్థిని ఐపిఎఫ్‌టి అభ్యర్థికి అనుకూలంగా ఉపసంహరించుకోవడం ద్వారా బహిరంగ మద్దతును అందచేసింది.

## కేరళ వందరోజుల లెఫ్ట్ ఫ్రంట్ పాలన:

కేరళ లెఫ్ట్ ఫ్రంట్ తన వంద రోజుల పాలనను ముగించుకున్నది. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలలో కొన్నింటిని లెఫ్ట్ ఫ్రంట్ నెరవేర్చింది. అధికారం లోకి వచ్చిన వెనువెంటనే, పెరుంబవూర్ హత్యా బాధితురాలు జిషా తల్లికి ఇల్లు కట్టించి, ఇచ్చిన గడువుకన్నా ముందే అప్పగించింది. సంక్షేమ పెన్షన్ల రేటు పెంచబడింది. మూతపడిన జీడిపప్పు కర్మాగారాలను తెరిపించింది. 37 లక్షల మందికి పైగా పెన్షన్ దార్లకు పెన్షన్ మొత్తాలు వారి ఇంటి వద్దనే అందచేయబడినాయి. వీటితో పాటు ప్రభుత్వం సమగ్ర రుణాల రద్దు పథకాన్ని ఆరంభించింది. ఎల్‌డిఎఫ్ వాగ్దానం చేసిన విధంగా బలహీనవర్గాల సంక్షేమం కోసం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కట్టుబడిఉన్న విషయాన్ని ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.

**ఆర్ఎస్ఎస్ దాడులు :** కేరళ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఆర్ఎస్ఎస్ మనపై దాడులను ముమ్మరం చేసింది. మన నలుగురు కామ్రేడ్స్ ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడుల వివరాలు విడిగా అందచేస్తున్నాము. ఓ వైపున ఇలా మనపై దాడులను అధికం చేస్తూనే, మరోవైపున ఆర్ఎస్ఎస్–బిజెపిల అధికారప్రతినిధి కేరళలో సిపిఐ(ఎం) ఆర్ఎస్ఎస్ వారిపై దాడులకు పాల్పడుతున్నదని తప్పుడు ప్రచారానికి పూనుకుంటున్నారు. కేంద్ర హోంమంత్రి సైతం మీడియా వార్తలను చూసి కేరళలో ఆర్ఎస్ఎస్ వారిని దాడుల నుండి రక్షించమని ముఖ్యమంత్రిని కోరారు. కానీ వాస్తవం దీనికి పూర్తి భిన్నంగా ఉంది. గత ఎన్నికల్లో తనకు లభించిన మద్దతును చూసుకొని బిజెపి బరితెగించి వ్యవహరిస్తున్నది. ముస్లిం మెజారిటీ ప్రాంతాలలో మతపరమైన విభజనను రెచ్చగొట్టడంతో పాటు, హింసారాజకీయాలకు పాల్పడుతున్నది. సిపిఐ(ఎం) పైన, ఎల్‌డిఎఫ్

పైన ఆర్‌ఎస్‌ఎస్‌- బిజెపిల నుండి పెరిగిన ఈ దాడులను ఎదుర్కొనడానికి పార్టీ సంసిద్ధం కావలసి ఉంది.

## బెంగాల్‌లో ఎన్నికల అనంతర హింసాకాండ

మనం గత సమావేశాలలో గుర్తించిన ఎన్నికల అనంతర హింసాకాండ కొనసాగుతూనే ఉంది. అయితే తృణమూల్ అనుసరిస్తున్న పద్ధతుల్లో మార్పు ఉంది. బీభత్సం, బెదిరింపులతో పాటు, అసెంబ్లీ ఎన్నిలకు ముందు లెఫ్ట్ ఫ్రంట్ గెలుచుకున్న పలు స్థానిక సంస్థలలో ప్రతినిధులను లొంగదీసుకోవడానికి బుజ్జగింపు (ముడుపులు) కు పాల్పడుతున్నది. నూతన తరహా దౌర్జన్యకర బెదిరింపులకు తృణమూల్ పూనుకుంటున్నది. నీ భర్త లెఫ్ట్ ఫ్రంట్‌కు మద్దతు వీడకపోతే నీవు వితంతువుగా మిగుల్తావు, స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే బాలికలు ఉన్నట్లయితే రేప్‌లు లాంటి వాటిని చవిచూడాల్సి వస్తుందని వారి తల్లిదండ్రులకు బెదిరింపులు వస్తున్నాయి. ఇలాంటి రకరకాల నీచమైన పద్ధతులను అనుసరిస్తూ తృణమూల్ వారు స్థానిక సంస్థల కార్యాలయాలను స్వాధీనం చేసుకున్నారు. 79 పంచాయతీ సమితులను లెఫ్ట్‌ఫ్రంట్ గెలుచుకోగా 43 పంచాయితీలను తృణమూల్ కాంగ్రెస్ బలవంతంగా ఆక్రమించుకుంది. ఇప్పుడు లెఫ్ట్ ఫ్రెంట్ చేతిలో 36 మాత్రమే ఉన్నాయి. లెఫ్ట్ ఫ్రంట్ 857 గ్రామపంచాయతీలను గెలుచుకుంటే ఇప్పుడు 427 మాత్రమే ఉన్నాయి. 416 పంచాయతీలను తృణమూల్ స్వాధీనం చేసుకున్నది. అలాగే, లెఫ్ట్ ఫ్రంట్ 9 మునిసిపల్ బోర్డులను గెలుచుకుంటే, వాటిలో ఆరింటిని తృణమూల్ బలవంతంగా స్వాధీనం చేసుకున్నది.

లెఫ్ట్ ఫ్రంట్, సిపిఐ(ఎం) లకు వ్యతిరేకంగా తృణమూల్ కొత్తగా ఇలాంటి తప్పుడు పద్ధతులను అనుసరిస్తున్నది. ఎందరు కామ్రేడ్స్ ప్రాణాలు కోల్పోయారు, ఎన్ని కుటుంబాలు తమ గృహాలను వీడవలసి వచ్చింది, ఎవరి పంట భూములు స్వాధీనం చేసుకోబడినాయి, మొదలైన వివరాలు విడిగా అందచేయబడినాయి.

## మన భవిష్యత్ కర్తవ్యాలు

కాశ్మీర్‌లో పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది. మన కార్యక్రమంలో పేర్కొన్నట్లు, కాశ్మీర్ పరిస్థితిలో వ్యవహరించిన పద్ధతి, "జాతి సమైక్యత అనే ప్రధానమైన అంశాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించడంలో బూర్జువా-భూస్వామ్య వర్గాల వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నది." (పేరా 5.5)

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతత్వ ఎజెండా వల్ల పరిస్థితి మరింత అధ్వాన్నమవుతున్నది. కాశ్మీర్ వ్యవహారంలో ఇలా ఉండటం వల్ల, దేశ సమైక్యత, సమగ్రతలకు, సార్వభౌమత్వాలకు

ఎలాంటి ముప్పు పొంచి ఉన్నదో దేశం మొత్తానికి తెలియచెప్పడానికి పార్టీ క్యాంపెయిన్లను నిర్వహించాలి. ఈ సమస్య పరిష్కారానికి మనం సూచిస్తున్న మార్గాలు ఎంతగా అనుసరించ దగ్గవో దేశప్రజలందరికీ తెలియచేయాలి.

ఎన్నికల సంస్కరణలు, కేంద్ర రాష్ట్ర సంబంధాల అంశాలను లేవనెత్తడంలో మన పార్టీ చొరవ తీసుకోవాలి. మరింత ప్రజాస్వామ్యయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నికల వ్యవస్థ కోసం విస్తారమైన ప్రజాశ్రేణుల మద్దతును సమీకరించేందుకు పార్టీ కృషి చేయాలి. అదే విధంగా దేశ ఫెడరల్ వ్యవస్థను పరిరక్షించేందుకు, కేంద్ర రాష్ట్ర సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు వివిధ ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేసుకోవాలి.

మన పార్టీ మహాసభలోను, నిర్మాణ ప్లీనం లోను నిర్ణయించిన విధంగా ప్రజాతంత్ర, సెక్యులర్ శక్తులను సమీకరిస్తూ మతతత్వ వ్యతిరేక వేదికలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర కమిటీలు తక్షణం చర్యలు చేపట్టాలి. మతతత్వ సమీకరణలను ఎండగడుతూ పలు రకాల కార్యక్రమాలను చేపట్టాలి.

మన రాష్ట్ర యూనిట్లు తమ తమ రాష్ట్రాలలోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను గుర్తించాలి. శ్రామిక ప్రజల డిమాండ్లతో కూడిన ప్రత్యామ్నాయ విధానాల వేదిక ప్రాతిపదికన ఈ శక్తులను సమీకరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలి.

ఇలాంటి పరిస్థితిలో వామపక్షాలకు, దళితులకు మధ్య ఐక్యతను నెలకొల్పడానికి ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన అవకాశాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలి. రాష్ట్రాల స్థాయిలో మన రాష్ట్ర శాఖలు అలాంటి సమైక్య కార్యాచరణను నెలకొల్పడానికి చొరవ తీసుకోవాలి.

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యూహాత్మక జూనియర్ భాగస్వామిగా ఉండటానికి మోడీ ప్రభుత్వం అంగీకరించడాన్ని వ్యతిరేకిస్తూ అన్ని స్థాయిలలో పార్టీ సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రచారాన్ని చేపట్టాలి.

మహత్తర అక్టోబర్ విప్లవ శతజయంతిని నిర్వహించాలన్న 21వ పార్టీ మహాసభ తీర్మానాన్ని అమలుచేయాలి. 2016 నవంబరు 7తో ప్రారంభించి, 2017 నవంబరు 7కు ముగిస్తూ ఏడాది పాటు ప్రచార కార్యక్రమాన్ని మనం చేపట్టాలని నిర్ణయించాము. అక్టోబరు విప్లవం సాధించిన పలు రకాలయిన విజయాలను, 20వ శతాబ్దంలో మానవజాతి నాగరికత రూపుదిద్దుకోవడంలో అది ఎలాంటి పురోగామ పాత్ర పోషించిందో వివరిస్తూ రాష్ట్రకమిటీలు నిర్దిష్టమైన కార్యక్రమాలను నిర్ణయించుకోవాలి.

## కేంద్ర కమిటీ ఈ క్రింది నిర్ణయాలు చేస్తున్నది

1. ప్రజలపై భారాల పెరుగుదల, పెరుగుతున్న నిరుద్యోగం, అధిక ధరలు, వ్యవసాయ సంక్షోభం, రైతులకు సహాయం, భూసమస్య, చౌకదుకాణాలు, ఉపాధి హామీ, సంక్షేమ పథకాలు వర్తించేందుకు ఆధార్‌కార్డ్ నమోదు తప్పనిసరి చేయడంవల్ల చట్టపరంగా వారికి రావలసిన రాయితీలు దూరమవుతున్న తీరు, ఎం.ఎన్.ఆర్.జి.ఎ. కూలి, తక్షణ, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మొదలైన అంశాలపై అన్ని రాష్ట్రాలలోను క్యాంపెయిన్లను, నిరసనలను, సమరశీల కార్యక్రమాలను తీవ్రతరం చేయాలి.
2. కాశ్మీర్ సమస్యను వివరించేందుకు అన్ని రాష్ట్రాలలోను క్యాంపెయిన్లను చేపట్టాలి.
3. ప్రజాతంత్ర, సెక్యులర్ శక్తులతో మతతత్వ వ్యతిరేక వేదికలను నిర్మించాలి.
4. దళిత గ్రూపులతో ఉమ్మడి కార్యక్రమాలను, కార్యాచరణను పటిష్టం చేయాలి.
5. మహిళలపైన, బాలలపైన పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా క్యాంపెయిన్లను నిర్వహించాలి.
6. ఈ బిజెపి ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదులకు లొంగిపోవడానికి వ్యతిరేకంగా క్యాంపెయిన్ నిర్వహించాలి.
7. మహత్తర అక్టోబర్ విప్లవ శతజయంతిని విజయవంతంగా నిర్వహించాలి.

ముద్రణ : అక్టోబర్, 2016 వెల : ₹ . 10/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-64, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ -520 002, ఫోన్ : 0866 - 2577533, సెల్ : 9490099202

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ